




దిక్కులు పిక్కటిల్లేలా...వినే వారి గుండెలదిరేలా డ్రమ్స్ సంగీతం.. మధ్యలో రంగురంగుల వెలుతురు చిమ్మే విద్యుత్ దీపాలు వెరసి డీజే సౌండ్ సిస్టంలతో జిల్లాలో ఎటువంటి ఉత్సవాలు, శుభకార్యాలు జరిగినా హోరెత్తిస్తున్నారు. చిన్నగ్రామం నుంచి పట్టణం వరకు ఎక్కడ చూసినా డీజే పాటల హోరెత్తుతోంది. డీజే శబ్దాల హోరులో యువత శృతి మించి డ్యాన్సులు చేయడం, అలుపు లేకుండా ఎగరడంతో గుండెపోటు తెచ్చుకుని ప్రాణాలు వదులుతున్నారు. ఇటీవల మదనపల్లె ప్రాంతంలో ఇద్దరు హైదరాబాద్ ప్రాంతంలో మరో ఇద్దరు మృతి చెందిన సంఘటనలే దీనికి ఉదాహరణ.

\- మదనపల్లె టౌన్



గుండె గుభిల్లుమనేలా..!



పెద్ద శబ్దాలతో మెదడుకు స్ట్రోక్

డీజే సంగీత హోరులో 50 నుంచి 70 డెసిబల్స్ శబ్దం విన పడుతుంది. గుండెలు అదిరేలా వచ్చే ఈ శబ్దాలతో ఇంటి చుట్టుపక్కల గ్లాస్ డోర్లు, వంట పాత్రలు అదరడంతో పాటు, కింద పడతాయి. అంతటి శబ్దాలు వింటూ డ్యాన్సులు వేసే యువతకు దీని వలన జరిగే ప్రమాదం తెలియక ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. అధిక శబ్దాలతో గుండెపై హానికరమైన ప్రభావాలు చూపుతాయని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. పెద్ద శబ్దాలతో గుండెపోటు, బ్రెయిన్‌స్ట్రోక్, రక్తం గడ్డకట్టడం జరుగుతాయని నిపుణులు అంటున్నారు. ఈ శబ్దాలు విన్నప్పుడు గుండె పైభాగంలోని రెండు గదులకు రక్తప్రసరణ సరిగ్గా జరగదు. దీని వలన కింది గదుల్లో కూడా రక్తప్రసరణ దెబ్బతింటుంది. 15 నిమిషాల పాటు 50 నుంచి 70 డెసిబల్స్ శబ్దాన్ని నిరవధికంగా వింటే ఆ శబ్దాలు గుండెకు హాని కలిగిస్తాయని చెబుతున్నారు. దీనికి తోడు డీజే సంగీతానికి నిలవకుండా డ్యాన్సు చేయడం కూడా గుండె పోటుకు దారి తీస్తుందని వైద్యులు చెబుతున్నా రు. అలుపు ఎరగకుండా, కాసేపు కూడా విశ్రాంతి తీసుకోకుండా డీజే శబ్దాలకు డ్యాన్సులు వేసి గుండెపోటుతో మృతి చెందిన వారి గురించి తెలుసుకుందాం.

బి.కొత్తకోట, మదనపల్లె మండలాల్లో ఇద్దరు మృతి

పది రోజులుగా పలు గ్రామాల్లో డీజే శబ్దాలతో డ్యాన్సులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బి.కొత్తకోట మండలం నాయనబావి గ్రామానికి చెందిన ఆకాశ్ (19) గ్రామంలోని వినాయక మండపం ఎదుట డీజే సంగీతానికి డ్యాన్సు చేశాడు. బాగా అలసిపోయిన ఆకాశ్ ఇంటికి వెళ్లగానే హఠాత్తుగా గుండెపోటుతో కింద పడిపోయాడు. గమనించిన కుటుంబీకులు ఆకాశ్‌ను ఆస్పత్రికి తరలించేలోపు మృతి చెందాడు. మదనపల్లె మండలం వలసపల్లె పంచాయతీ కృష్ణాపురానికి చెందిన ప్రశాంత్ (25) ఆటోడ్రైవర్‌గా పనిచేసేవాడు. ఈ క్రమంలో ఈనెల 13వ తేదీ రాత్రి గ్రామంలో డీజే సంగీతానికి ప్రశాంత్ గంట పాటు డ్యాన్సులు చేశాడు. అలసిపోయిన ప్రశాంత్ ఇంటికి వెళ్లగానే ఛాతి నొప్పి రావడంతో కుప్పకూలిపోయాడు. కుటుంబీకులు అతడిని మాట్లాడించినా ఉలుకుపలుకు లేదు. దీంతో ప్రశాంత్‌ను అతడి కుటుంబీకులు మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. అలాగే సోమవారం హైదరాబాద్‌లోని మణికొండ అల్కాపురి కాలనీలో శ్యామ్‌ప్రసాద్ అనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ డీజే పాటలకు డ్యాన్సులు వేశాడు. ఇంటికి వెళ్లగానే గుండెనొప్పితో కుప్పకూలాడు. ఆస్పత్రికి తరలించేలోపే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి చెందాడు. ఇదిలా ఉండగా మదనపల్లె పట్టణం చంద్రాకాలనీ ఎక్స్‌టెన్షన్ ప్రాంతంలో సరిగ్గా రెండేళ్ల క్రితం సెప్టెంబరు 13వ తేదీ తులసీప్రసాద్, శిరీషకు వివాహమైంది. సాయంత్రం ఇద్దరికి నలుగులు పెట్టాక, రికార్డింగ్ డ్యాన్సులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వరుడు తులసీప్రసాద్ గంట సేపు డీజే పాటలకు డ్యాన్సులు చేశాడు. రాత్రి శోభనం గదిలోకి వెళ్లాక తులసీప్రసాద్ గుండెనొప్పితో కుప్పకూలిపోయాడు. ఆస్పత్రికి తరలించేలోగానే మృతి చెందాడు. వీటన్నింటిని బట్టి చూస్తే 50 డెసిబల్స్ నుంచి 70 డెసిబల్స్ శబ్దాలు వినిపించే డీజే పాటలతో యువకులు గుండెపోటుతోనే మృతి చెందినట్లు తెలుస్తోంది.


గుండెపోటుతో మృతి చెందిన నాయనబావికి చెందిన ఆకాశ్ (ఫైల్).. కృష్ణాపురానికి చెందిన ప్రశాంత్ (ఫైల్)

డీజేలు వద్దని వారిస్తూనే ఉన్నాం..

పండుగలు, ఉత్సవాల సందర్భంగా అశ్లీల నృత్యాలు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పాటలు డీజేలో పెట్టరాదని ఇప్పటికే ఆదేశించాము. ఇలాంటి ఘటనపై బి.కొత్తకోట మండల కేంద్రంలో ఒక కేసు కూడా నమోదు చేశాము. అధిక శబ్దాలతో డీజే పెట్టవద్దని నిర్వాహకులకు సూచనలిచ్చాము. ఎవరైనా ఈ శబ్దాలకు ఇబ్బందిపడి ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

\- కొండయ్యనాయుడు, డీఎస్పీ, మదనపల్లె

డీజే శబ్దాలను నియంత్రించాల్సి ఉంది

పండుగలు, పెళ్లిళ్లు, జాతరల సందర్భంగా వినిపించే డీజే పాటల శబ్దాలను నియంత్రించాల్సిన అవసరం ఉంది. దీనివలన శబ్ద కాలుష్యంతో పాటు, వినికిడి శక్తి కోల్పోయే ప్రమాదం ఉంది. అంతేకాకుండా ఈ డీజే డ్యాన్సుల సంబరాల్లో యువత వర్గాలుగా విడిపోయి ఘర్షణలకు దిగడం, దాడులకు పాల్పడటం చూస్తూనే ఉన్నాము. ఉత్సవాలతో పాటు శుభకార్యాల్లో ఎక్కువ శబ్దాలతో చెవులు హోరెత్తించేలా ఏర్పాటు చేసే డీజేలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

నేటి నుంచి స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలు : కలెక్టర్

రాయచోటి (కలెక్టరేట్), సెప్టెంబరు 16: స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని ఈనెల 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు జిల్లా అంతా చేపట్టాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలో స్వచ్ఛ భారత్‌ను ప్రారంభించి 10 సంవత్సరాలైన సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలు, పంచాయతీలలో ఈ కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు. 15రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని అధికారులందరూ సమన్వయంతో నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రతపై మానవహార, ర్యాలీలు, స్వచ్ఛతా పరుగులు మారథాన్‌రన్ తదితర కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలలో, విద్యాసంస్థలలో ప్రతిజ్ఞ చేసి శ్రమదానం చేయాలన్నారు. ముఖ్యంగా గ్రామాలలో రోడ్లు, చెత్తకుప్పలు, బోరుబావుల చుట్టుపక్కల శుభ్రంగా ఉండేవిధంగా డ్రైవ్ నిర్వహించాలన్నారు. ఎంపీడీవోలు, ఈవోపీఆర్‌డీలు, అర్‌డబ్ల్యుఎస్ అధికారులు, కార్యదర్శులు దృష్టి సారించాలన్నారు. అలాగే గ్రామాలలో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాలు చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రజలందరి భాగస్వామ్యంతో శ్రమదానం ద్వారా పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు.

పర్యాటక పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి (కలెక్టరేట్), సెప్టెంబరు 16: ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఉత్తమ పర్యాటక పురస్కారాలను ప్రభుత్వం ఇవ్వనుంది. ఈనెల 27వ తేదీ పర్యాటక దినోత్సవం సందర్భంగా పురస్కారాల కోసం దరఖాస్తులు పంపుకోవాలని టూరిజం శాఖ తెలిపింది. 2023-24 సంవత్సరంలో పర్యాటక ప్రాంతాల కోసం ఉత్తమ కార్యనిర్వహణ పద్ధతులు అవలంభించిన ప్రభుత్వ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, పర్యాటక అభిమానులు, సోషల్ మీడియా ప్రతినిధులకు 38 రకాల అవార్డులను ప్రభుత్వం ప్రకటించింది. ప్రతి కేటగిరీ నుంచి ఉత్తమ ప్రతిభ కనబరచిన వ్యక్తి లేదా సంస్థను ఎంపిక చేసి పురస్కారాలు ఇస్తారని, మరింత సమాచారం కోసం 63099 42032 నెంబరును సంప్రదించాలని తెలిపారు.

హార్సిలీహిల్స్‌లో హైకోర్టు జడ్జికి వీడ్కోలు

బి.కొత్తకోట, సెప్టెంబరు 16: బి.కొత్తకోట మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌కు రెండురోజుల పర్యటన కోసం కుటుంబ సమేతంగా విచ్చేసిన రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ మన్మధరావు సోమవారం తిరుగు పయనమయ్యారు. ఈ సందర్భంగా ఆయన పోలీసుల గౌరవవందనం స్వీకరించారు. రెవెన్యూ అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. కుటుంబ సభ్యులు హిల్స్‌పై చూడదగ్గ పర్యాటక ప్రదేశాలైన గాలిబండ, అటవీప్రాంగణం, మానససరోవరం, ఏరియల్ వ్యూపాయింట్లను తిలకించారు. చల్లని, ఆహ్లాదకరమైన వాతావరణంలో సేదతీరారు.

మంటల్లో లారీ

- కడప-చెన్నై రహదారిపై లారీ దగ్ధం


కాలిపోతున్న లారీ

సిద్దవటం, సెప్టెంబరు 16: కడప-చెన్నై జాతీయ రహదారి సిద్దవటం మండలం మాధవరం సమీపంలోని చౌడేశ్వరిపేట వద్ద సోమవారం మంటలు వ్యాపించి లారీ దగ్ధమైంది. వివరాలిలా ఉన్నాయి. ముద్దనూరు నుంచి చెన్నైకి సిలికాన్ ఇసుక తీసుకెళుతుండగా ఒక్కసారిగా లారీ నుంచి మంటలు చెలరేగి విపరీతమైన పొగ వచ్చింది. దీంతో ఆ ప్రాంతమంతా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. విషయం తెలుసుకున్న ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణంరాజునాయక్, సిద్దవటం ఎస్ఐ చిరంజీవి ఆ ప్రాంతానికి చేరుకుని అగ్నిమాపక వాహనాన్ని రప్పించి మంటలను అదుపు చేశారు. అయితే ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని, డ్రైవర్ క్షేమంగా బయటపడ్డాడు. ప్రమాదానికి గల కారణాలు తెలియలేదని, ఫైర్ సిబ్బంది నివేదిక వచ్చాక తెలుస్తుందని ఎస్ఐ తెలిపారు. మంటలను వెంటనే అదుపు చేసి జాతీయ రహదారిలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు.


ప్రమాదంలో దగ్ధమైన లారీని పరిశీలిస్తున్న ఎస్ఐ చిరంజీవి

మంగంపేట అభివృద్ధికి సహకరిస్తాం

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి
- 576 మందికి పట్టాలు పంపిణీ చేసిన మంత్రి


ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 16: భూములు, ఇళ్లను ఏపీఎండీసీ సంస్థ అభివృద్ధికి ఇచ్చిన మంగంపేట గ్రామ ప్రజలు గొప్ప మనసున్న వారని, మంగంపేట అభివృద్ధికి సహకరిస్తామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కొనియాడారు. మంగంపేట కాపుపల్లె, హరిజనవాడ, అరుంధతివాడ గ్రామాల ప్రజలకు పునరావాస కాలనీ అయిన ఆర్‌ఆర్-5లో నివాస స్థలాలకు ఇంటిపట్టాల పంపిణీ కార్యక్రమంలో సోమవారం సాయంత్రం మంత్రి పాల్గొన్నారు. మంత్రి, ఎమ్మెల్యే, అధికారుల చేతుల మీదుగా లబ్ధిదారులకు ఇంటిపట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కోలార్ అంటే గోల్డ్ మైన్స్, మంగంపేట అంటే ముగ్గురాళ్ల గనులు అని ఇదే రాష్ట్రానికి ఆదాయ వనరు అని ప్రతి ఒక్కరికీ తెలిసిన విషయమేనన్నారు. గత ఐదు సంవత్సరాల్లో రాష్ట్రంలో ఉన్న మైన్స్ దోచి వేసినవారు ఎవరో అందరికీ తెలిసిన విషయమేనని, ఇసుక రాష్ట్రాన్ని దాటి చెన్నై, బెంగళూరుకు తరలించి అక్రమంగా దోచుకున్న ఖ్యాతి గత ప్రభుత్వం మూటగట్టుకుందని, తమ ప్రభుత్వంలో అలాంటి వాటికి చోటు లేదన్నారు.

ఎమ్మెల్యే అరవ శ్రీధర్, తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డిలు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి సహకరిస్తున్న మంగంపేట గ్రామ ప్రజలకు తమ శక్తిమేర సహాయ సహకారాలు అందిస్తామని, అలాగే నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, సబ్‌కలెక్టర్ నిధియా దేవి, రాజంపేట డీఎస్పీ ఎన్.సుధాకర్, మంగంపేట గ్రామ పెద్దలు పులపత్తూరు రామసుబ్బారెడ్డి, మంగంపేట సుధాకర్, టీడీపీ సీనియర్ నాయకుడు అనుమలగుండం చంద్రమోహన్, తహసీల్దార్ పీర్‌మున్ని, మంగంపేట సర్పంచ్ మినుకు సుధాకర్, జడ్పీటీసీ లక్ష్మీనరసయ్య, కల్లా చలపతి, ముక్కా సాయివికాస్‌రెడ్డి, జనసేన నాయకులు జోగినేని మణి, ప్రజలు పాల్గొన్నారు.

750 నూతన బస్సులను ప్రారంభించాం

- వచ్చే ఏడాది లోపు వెయ్యి కొత్త బస్సులు
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 16: కూటమి ప్రభుత్వం ఏర్పాటైన మూడు నెలల కాలంలోనే రాష్ట్రంలో అన్ని ఆర్టీసీ డిపోల్లో 750 నూతన బస్సులను ఏర్పాటు చేశామని, వచ్చే ఏడాది లోపు 1000 బస్సులను ఏర్పాటు చేసి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం లక్కిరెడ్డిపల్లెలో తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని ఆయన మండల యువ నాయకుడు, మాజీ ఎంపీటీసీ యనమల మదన్‌మోహన్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ముందుగా అనంతపురం గంగమ్మ తల్లిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన బహిరంగసభలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కోసం ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలలకే 750 బస్సులను ఏర్పాటు చేశామని తెలిపారు. విజయవాడలో వరదలు బీభత్సం సృష్టించినా చంద్రబాబునాయుడు అక్కడే ఉండి ప్రజలకు కావాల్సిన వసతులు కల్పించారని, జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హెలికాప్టర్‌లో తిరిగి వెళ్లారని ఇదీ ఇద్దరికి తేడా అని తెలిపారు. రాయచోటి నియోజకవర్గంలో తాగునీటి సమస్య తీర్చడానికి రూ.15 కోట్లు వెచ్చించి అన్ని గ్రామాలకు శాశ్వత మంచినీటి పథకం బోర్లు ఏర్పాటు చేసి ప్రతి ఇంటికి తాగునీరును అందిస్తామన్నారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డి, మండల అధ్యక్షుడు శంకారపు జయరాం, కుప్పం నియోజకవర్గ ఇన్‌చార్జ్ గాజుల ఖాదర్‌బాషా, టీడీపీ నాయకులు ఎర్రగుడి చంద్రశేఖర్‌రెడ్డి, నవీన్‌కుమార్ రెడ్డి, షేక్ ఆరిఫ్, డాక్టర్ షఫీనాయక్, అధిక సంఖ్యలో టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెరుగుతున్న టమోటా ధర

- 22 కేజీల బాక్సు రూ.1020.. కేజీ రూ.46.36
- దిగుబడి తగ్గడంతో పెరుగుతున్న ధర.. తగ్గిన అమ్మకాలు
- ఆనందంలో రైతులు

ములకలచెరువు, సెప్టెంబరు 16: టమోటా ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ములకలచెరువు మార్కెట్‌లో రెండు రోజుల క్రితం వరకు నాణ్యతను బట్టి రూ.400 నుంచి రూ.600 వరకు పలికిన ధర ప్రస్తుతం ఒక్కసారిగా పెరిగిపోయింది. సోమవారం 22 కిలోల బాక్సు నాణ్యతను బట్టి రూ.800 నుంచి రూ.1020 వరకు పలికింది. కేజీ ప్రకారమైతే రూ.36.36 నుంచి రూ.46.36 వరకు పలికింది. అలాగే టమోటాల దిగుబడి తగ్గడంతో మార్కెట్‌కు తక్కువగా వస్తున్నాయి. 10 రోజుల క్రితం వరకు మార్కెట్‌కు ప్రతిరోజూ 70 వేల బాక్సుల కాయలను రైతులు అమ్మకానికి తీసుకొచ్చేవారు. వినాయక చవితి పండగ మరుసటి రోజు నుంచి మార్కెట్‌కు టమోటాలు రావడం తగ్గిపోయింది. ప్రస్తుతం 45 వేల నుంచి 50 వేల బాక్సుల కాయలు మాత్రమే వస్తున్నాయి. ఈ కారణంగా టమోటా ధరలు పెరుగుతూ వస్తున్నాయి. దీనిని బట్టి చూస్తే టమోటాల దిగుబడి కూడా తగ్గినట్టు తెలుస్తోంది.

స్థానిక మార్కెట్‌కు శ్రీసత్యసాయి జిల్లా, తనకల్లు, నల్లచెరువు, ఓడీసీలతో పాటు తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువు, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట మండలాల నుంచి టమోటాలను రైతులు అమ్మకానికి తీసుకొస్తున్నారు. ఇక్కడ వ్యాపారస్థులు టమోటాలను కొనుగోలు చేసి పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, చత్తీస్‌ఘడ్ తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. ఇక్కడి నుంచి 10 రోజుల క్రితం వరకు 30 నుంచి 45 లారీల కాయలు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అయ్యేవి. ప్రస్తుతం 20 నుంచి 30 లారీల కాయలు ఎగుమతి అవుతున్నాయి.

మార్కెట్‌లో రైతుల సంబరాలు

ములకలచెరువు మార్కెట్‌లో సోమవారం రైతులు సంబరాలు చేసుకున్నారు. 22 కేజీ బాక్సు రూ.1020 పలకడంతో పలువురు రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఇంతటితో ఆగకుండా బాణాసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. ధరలు ఇలాగే ఉండాలని ఆకాంక్షించారు.



వరద బాధితులకు ఎన్‌ఆర్ఐ టీడీపీ విరాళం

- మంత్రి పెమ్మసానికి రూ.25 లక్షల చెక్కు అందజేత


అమెరికాలోని డల్లాస్‌లో కేంద్ర మంత్రి పెమ్మసానికి రూ.25 లక్షల చెక్కును అందిస్తున్న ఎన్‌ఆర్ఐ టీడీపీ సభ్యులు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 16: వరదలతో సర్వం కోల్పోయిన విజయవాడ వరద బాధితులకు అండగా మేమున్నామంటూ వేల మైళ్ల దూరంలోని ఎన్‌ఆర్ఐ టీడీపీ సభ్యులు ముందుకు వచ్చారు. సోమవారం అమెరికాలోని డల్లాస్ సిటీలో కేంద్ర సహాయశాఖ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు ఎన్‌ఆర్ఐ టీడీపీ సభ్యులు కలసి రూ.25 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ వరద బాధితులను ఆదుకోవడానికి సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పడుతున్న కృషికి తమ వంతు సహాయంగా ఈ విరాళం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో తానా మాజీ అధ్యక్షుడు సతీశ్ వేమన, జయరామ్ కోమటి, లోకేశ్ కొణిదెల, కిశోర్ చలసాని, సతీశ్ కోమన పాల్గొన్నారు.

చేనేత సంఘాలకు ఊపిరి

- ఈనెల 21 నుంచి ఎన్నికల ప్రక్రియ

మైలవరం, సెప్టెంబరు 16: నేతన్నలను వైసీపీ ప్రభుత్వం గాలి కొదిలేసింది. చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన చేసింది. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన రాయితీ, పరపతి రుణాలు దక్కలేదు. దుస్తులను కూడా కొనుగోలు చేయలేకపోయిందని చేనేతలు ఆరోపిస్తున్నారు. మరో వైపు బకాయిలు చెల్లింపులను నిలిపివేసింది. దీంతో చాలామంది వృత్తిని వదిలి కూలి పనులకు వెళ్లాల్సిన దుస్థితి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు చేనేత సంఘాల బలోపేతానికి చర్యలు తీసుకుంది. ఎన్నికలు నిర్వహించడానికి కార్యాచరణ సిద్ధం చేయాలని ఉత్తర్వులు ఇచ్చింది. ఈనెల 21 నుంచి ప్రక్రియ ప్రారంభం కానుంది. ఒక్కో సొసైటీలో 50 మంది వరకు ఉండేలా దిశానిర్దేశం చేయనుంది. తద్వారా సొసైటీల సంఖ్య పెరిగి రాయితీ, రుణాలు సకాలంలో అందుతాయని భావిస్తోంది. 2014-2019 మధ్య ఎలాంటి లబ్ధి చేకూరిందో అదే స్థాయిలో పథకాలను ప్రవేశపెట్టనున్నారు. వచ్చే నెల 21వ తేదీ లోపు గుర్తింపు పొందిన సొసైటీలు, నమోదు కానివి, నూతనంగా ఏర్పాటైన వాటి వివరాలను సేకరించనున్నారు. నవంబరు 14న ప్రకటన రానుంది. డిసెంబరు 4న ఎన్నికలుంటాయి. అదే నెల 6న నూతన పాలకవర్గాలు ఏర్పడనున్నాయి.

భక్తిశ్రద్ధలతో మిలాదున్నబీ పండుగ

బి.కొత్తకోట, సెప్టెంబరు 16: మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని ముస్లింలు బి.కొత్తకోట పట్టణ వీధులలో సోమవారం జులూస్ ప్రదర్శన నిర్వహించారు. మహమ్మద్‌ప్రవక్త ప్రవచనాలను, శాంతి సౌభ్రాతృత్వ జీవనవిధానం వారు చూపిన మార్గాన్ని స్మరించుకున్నారు. ఇస్లామిక్ క్యాలెండర్ మూడవ నెల అయిన రబీవుల్‌అవ్వల్‌లో 12వ తేదీ మహమ్మద్ ప్రవక్త జన్మించారు. ఈ సందర్భంగా ఈ 12 రోజుల పాటు బారాబొఫాత్ పేరుతో ప్రవక్త తలంపుతో ముస్లింలంతా గ్రంథపఠనం చేస్తారు. ముస్లింల పవిత్ర గ్రంథం ఖురాన్ గురించి, అందులోని దైవ వాక్యాల గురించి స్మరించుకుంటారు. ఈ సందర్భంగా పట్టణంలోని చౌక్ మసీదు నుంచి జులూస్‌ను ప్రారంభించి జ్యోతిచౌక్, బెంగళూర్ రోడ్డు, బిలాల్ మసీదు, దిగువ బస్టాండ్ మీదుగా మసీదు పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించి, అన్నదానం ఏర్పాట్లు చేశారు.


బి.కొత్తకోటలో మిలాదున్నబీ వేడుకల్లో భాగంగా జులూస్ ఊరేగింపు

కొలిమిట్టకు సరిహద్దు గండం

అటు పంచాయతీ ఇటు మున్సిపాలిటీ ● తాగునీటి కోసం నానా తంటాలు

అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులతో పైపులైన్లు ధ్వంసం ● పట్టించుకోని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు



పనిచేయని నీటి పథకం బోరు



అరకొర నీటిని అందిస్తున్న నీటి పథకం బోరు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 16: కొలిమిట్టకు సరిహద్దు తాకడంతో తాగునీటి సమస్య మొదలైంది. జిల్లా కేంద్రం రాయచోటి మున్సిపాలిటీ పరిధిలో సగభాగం, పంచాయతీ పరిధిలో సగభాగం కొలిమిట్ట ఉండడంతో రెంటికీ చెడ్డ రేవడిలా తయారైంది. ఫలితంగా అభివృద్ధి విషయంలో ఏ అధికారులూ పట్టించుకున్న పాపాన పోలేదు. కూలి పనులు చేసుకుంటున్నా ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని రకాల పన్నులను చెల్లిస్తున్నా కొలిమిట్ట వాసులకు అధికారులు మాత్రం మౌలిక సదుపాయాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారనడంలో సందేహం లేదు. పగలంతా పనులు చేసుకుని రాత్రి ఇంటికి వచ్చే సమయానికి తాగునీరు, అవసరాలకు నీరు దొరక్క అల్లాడుతున్నారు. నీటి సమస్యపై వైసీపీ ప్రభుత్వంలో కూడా పలుమార్లు కొలిమిట్టవాసులు ఇటు మున్సిపల్ అధికారులు, అటు పంచాయతీ వారికి సమస్యను విన్నవించినా అధికారులు ఎవరూ వారి గోడును పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో నిత్యం నీటి కోసం యజ్ఞం చేయాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. వివరాల్లోకెళితే...

జిల్లా కేంద్రం రాయచోటి మున్సిపాలిటీ చెన్నముక్కపల్లె పంచాయతీల సరిహద్దు ప్రాంతం కొలిమిట్ట వాసులు తాగునీటి కోసం నానా తంటాలు పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టడంతో ఆ ప్రాంతానికి వెళ్లే పైపులైన్ ధ్వంసం కావడంతో కొలిమిట్ట వాసులకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. సుమారు ఏడాదిగా సుమారు 500 కుటుంబాలకుపైగా కొలిమిట్ట వాసులు నీటికోసం అవస్థలు పడుతున్నా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. అటు పంచాయతీలో ఇటు మున్సిపాలిటీలో ఉన్న కొలిమిట్ట ప్రాంతం రెంటికి చెడ్డ రేవడిలా తయారైంది. రాయచోటి నియోజకవర్గంలోని చుట్టుపక్కల మండలాలకు చెందిన ఎందరో పేదలు తమ పిల్లల చదువుకోసం గ్రామాలను వదిలి బతుకు దెరువు కోసం పట్టణానికి వచ్చి కూలీనాలీ చేసుకుంటూ అద్దె గృహాల్లో నివసిస్తూ చిన్న చిన్న రేకుల షెడ్లు వేసుకుని



తాగునీటి సమస్యను పరిష్కరించాలంటూ గోడును వినిపిస్తున్న కొలిమిట్ట వాసులు

జీవనం సాగిస్తున్న కొలిమిట్ట ప్రాంతీయులు నిత్యం సమస్యలతో సావాసం చేస్తున్నారు. అన్నిరకాల పన్నులను చెల్లిస్తున్నా కొలిమిట్ట వాసులకు అధికారులు మౌలిక సదుపాయాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారనడంతో సందేహం లేదు. కొలిమిట్ట ప్రాంతంలో నివసించే చాలామంది తోపుడు బండ్ల వ్యాపారాలు, రైస్ మిల్లులు ఇతర దుకాణాల్లో రోజు వారీ పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. తాగునీటి సమస్యపై వైసీపీ ప్రభుత్వంలో కూడా పలుమార్లు కొలిమిట్ట వాసులు ఇటు మున్సిపల్, అటు గ్రామ పంచాయతీ వారికి సమస్యను విన్నవించినా అధికారులు ఎవరూ వారి గోడును పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో ఈ ప్రాంత వాసులు వారి ప్రాంతంలో గతంలో టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన బోర్ల ద్వారా నీటిని తెచ్చుకుంటూ అరకొర నీటితో అవసరాలను తీర్చుకుంటున్నారు.

యూజీడీ పనులతో పైపులైన్ ధ్వంసం

వైసీపీ ప్రభుత్వంలో రాయచోటికి రూ.300 కోట్లతో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పట్టణ ప్రజలకు సమస్యలను తెచ్చిపెడుతున్నాయి. ఈ పనులను పొందిన కాంట్రాక్టర్లు రాయచోటి మున్సిపాలిటీలో కా కుండా మున్సిపాలిటీకి బయట పంచాయతీలు, నివాసాలు లేని ప్రాంతాల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను చేపట్టి చేతులు దులుపుకొంటున్నారు. ఈ క్రమంలోనే ఇటు మున్సిపాలిటీకి అటు చెన్నముక్కపల్లె పంచాయతీ సరిహద్దు ప్రాంతమైన కొలిమిట్ట ప్రాంతానికి పైపులైన్ వెళ్లే మార్గాల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టడంతో ఆ ప్రాంతానికి వెళ్లే పైపులైన్ పనులు అక్కడక్కడా ధ్వంసం కావడంతో గతేడాదిగా నీటి సరఫరా జరగలేదు. దీంతో వారు చేతిపంపులు, ప్రైవేటు బోర్లు, నీటి ట్యాంకర్లను ఆశ్రయిస్తూ తాగునీటి కోసం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా ఉన్నతాధికారులు చొరవ చూపి మా ప్రాంతాన్ని మున్సిపాలిటీలోకి చేర్చి ఇబ్బందుల నుంచి గట్టెక్కించాలని కొలిమిట్ట వాసులు కోరుతున్నారు.

పట్టించుకోని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

సుమారు 500 కుటుంబాలకుపైగా నివసిస్తున్న కొలిమిట్ట ప్రాంతానికి రోళ్లమడుగు నీటి పథకం నుంచి గానీ అటు వెలిగల్లు నీటి పథకం నుంచి కానీ పైపులైన్ ఏర్పాటు చేసి తాగునీరు అందించాలని ఆ ప్రాంతీయులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పట్టించుకోకపోయారు. దీంతో మూడు వేలకుపైగా జనాభా కలిగిన కొలిమిట్ట ప్రాంత వాసులు తాగునీటి ఇబ్బందులను నిరంతరం ఎదుర్కొంటూనే ఉన్నారు. దీనికి తోడు చెన్నముక్కపల్లె పంచాయతీలో వైసీపీ ప్రభుత్వంలో ప్రజల తాగునీటి సౌకర్యం కోట్లాది రూపాయలు నిధులు మంజూరైనా పనులను పూర్తి చేయడంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నిలువెల్లా నిర్లక్ష్యం ప్రదర్శించడంతో నేడు ఆ ప్రాంత పేదలకు తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రత్యేక చొరవ చూపి కొలిమిట్ట ప్రాంతంలో ఉన్న తాగునీటి సమస్య పరిష్కారానికి అటు వెలిగల్లు నీటి పథకం నుంచి గానీ ఇటు రోళ్లమడుగు నీటి పథకం నుంచి గానీ పూర్తి స్థాయిలో పైపులైన్ ఏర్పాటు చేసి శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అయితే రోళ్లమడుగు నీటి పథకం నుంచి కొలిమిట్ట ప్రాంతానికి తాగునీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన నీటి పథకం సంపు నిర్మాణంలో పనులు సకాలంలో పూర్తి చేయకుండా కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో తాగునీటిని అందించలేకపోతున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అంటున్నారు. కాంట్రాక్టర్లు సంపు నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేస్తే చెన్నముక్కపల్లిలో చాలా వరకు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అధికారులు అంటున్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నాం

చెన్నముక్కపల్లె పంచాయతీ కొలిమిట్ట తదితర ప్రాంతాల్లో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నాం. ఇప్పటికే ఆ ప్రాంతంలో తాగునీటి బోర్ల ద్వారా ప్రజలకు ఇబ్బంది లేకుండా నీటిని అందిస్తున్నాం. రోళ్లమడుగు నీటి పథకానికి సంబంధించిన సంపు పూర్తయితే చాలా ప్రాంతాలకు ఇబ్బంది లేకుండా నీటిని అందించేందుకు అవకాశాలున్నాయి. కొలిమిట్ట ప్రాంతంలో నీటి సమస్య ఉన్నట్లు మా దృష్టికి వచ్చింది. త్వరలోనే నీటి సమస్య లేకుండా చూస్తాం.

- ప్రదీప్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, రాయచోటి

మా గోడు ఎవరూ పట్టించుకోవడం లేదు



మా ప్రాంతంలో నెలకొన్న తాగునీటి సమస్యపై పలుమార్లు ఇటు మున్సిపల్ అధికారులు అటు పంచాయతీ వారికి చెప్పినా పట్టించుకోవడం లేదు. పగలంతా కూలి పనులు చేసుకుని జీవించే తాము నీటికోసం చాలా ఇబ్బందులు పడుతున్నాము. అక్కడక్కడా చేతి పంపులు, బోర్ల ద్వారా వచ్చే నీరు పూర్తి స్థాయిలో సరిపోవడం లేదు. ఒక్కో దశలో నీటి ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేయాల్సి వస్తోంది. జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుని మా ప్రాంతానికి తాగునీటిని అందించి పుణ్యం కట్టుకోవాలి.

- మైమున్‌బీ, కొలిమిట్ట, రాయచోటి

మాకు ఎలాంటి సౌకర్యాలు లేవు



ప్రభుత్వం నుంచి ఎలాంటి సౌకర్యాలు అందడం లేదు. ప్రభుత్వ నిబంధనల మేరకు తాము అన్ని రకాల పనులను సకాలంలో చెల్లిస్తున్నాము. అయినా తాగునీటి సమస్య మమ్మల్ని వెంటాడుతోంది. తమ గోడును ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదు. బోర్ల ద్వారా చేతిపంపుల ద్వారా నీటిని తెచ్చుకుని అవసరాలను తీర్చుకుంటున్నాము. రాయచోటిలో ఉన్నా మాకు ఎలాంటి సౌకర్యాలు లేక పల్లె జీవనం లాగా ఉన్నాము. జిల్లా ఉన్నతాధికారులు సకాలంలో తాగునీటిని అందించి ఆదుకోవాలి. మా గ్రామాన్ని మున్సిపాలిటీ పరిదిలోకి మార్చాలి.

- మహబూబ్‌బాషా, కొలిమిట్ట, రాయచోటి

తైక్వాండోలో సత్తాచాటిన విద్యార్థులు

● రాష్ట్రస్థాయిలో పతకాలు



బహుమతులు అందుకున్న తైక్వాండో క్రీడాకారులు

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 16: 14,15 తేదీల్లో కడపలో టెంపుల్ ఆఫ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన తైక్వాండో ఛాంపియన్ షిప్ జూనియర్, సబ్‌జూనియర్, సీనియర్ల విభాగంలో ఎర్రగుంట్ల విద్యార్థులు పతకాలు సాధించినట్లు కోచ్ దినేష్ తెలిపారు. సినియర్ ఓపెన్ విభాగంలో ఎస్.అమానుల్లా, డి.సుజయ్‌షాలోం బంగారు పతకాలు సాధించారన్నారు. ఎస్.హసనైను వెండి, బాలికల విభాగంలో మహిత, రిషిత బంగారు, ఎం.గమన వెండి, ఎం.గగన కాంస్య పతకం, జూనియర్స్ విభాగంలో బాలసాయి సాత్విక్, చంద్ర కాంత్ బంగారు, పీఎస్ షామీర్ హుస్సేన్, ఎస్.యజ్ఞహిత్‌రెడ్డి వెండి పతకాన్ని సాధించారు. సబ్ జూనియర్స్ విభాగంలో పి.రెడ్డి సాకేత్, సి.వెంకట సాయి తులసినాథ్, పి.యశ్వంత్, ఎం.కార్తీక్‌రెడ్డి బంగారు పతకాన్ని సాధించారన్నారు.

తిరుపతి నుంచి అంతర్జాతీయ విమానాలు నడపాలి

● అమెరికాలో కేంద్ర మంత్రి పెమ్మసానికి ఎన్‌ఆర్‌ఐ టీడీపీ నేత వినతి



కేంద్ర మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసానితో చర్చిస్తున్న బాలాజీ తాతినేని

సుండుపల్లె, సెప్టెంబరు16: తిరుపతి విమానాశ్రయం నుంచి అంతర్జాతీయ విమానాలు నడపడానికి చర్యలు చేపట్టాలని అమెరికాలో టీడీపీ సీనియర్ నేత తాతినేని శివకుమార్ నాయుడు సోదరుడు ఎన్‌ఆర్ఐ టీడీపీ కమిటీ ప్రతినిధి బాలాజీ, తాతినేని విన్నవించారు. అమెరికాకు వెళ్లిన కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసానితో అన్నమయ్య జిల్లా సుండుపల్లె మండల వాసి బాలాజీ తాతినేని మాట్లాడుతూ అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, కడప జిల్లాల నుంచి వేలాది మంది గల్ఫ్ దేశాలకు వెళ్లి ఉపాధి పొందుతున్నారన్నారు. గల్ఫ్ దేశాలనుంచి సొంత ప్రాంతాలకు వచ్చి పోవడానికి తమిళనాడులోని చెన్నై, కర్ణాటకలోని బెంగుళూరులోని విమానాశ్రయాలకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో అధిక ఖర్చులతో పేదలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దీన్ని దృష్టిలో ఉంచుకుని తిరుపతి నుంచి అంతర్జాతీయ విమాన సర్వీసులు నడపడానికి కృషి చేయాలని కోరారు. ఎంతో కాలంగా అభివృద్ధిని నోచుకోని అన్నమయ్య జిల్లా సుండుపల్లె మండలం తిమ్మసముద్రం గ్రామాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి పర్చడానికి సహకారం అందించాలని కోరారు. టీ. సుండుపల్లె మండలంలో టెలీ కమ్యూనికేషన్, ఇంటర్ నెట్ సౌకర్యాలు సక్రమమైన అందుబాటులో లేవని మండలంలో బీఎస్‌ఎన్ఎల్ అదనపు టవర్లు, భారత నెట్ 5జీ సౌకర్యం కల్పించడానికి చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. అన్నమ య్య జిల్లా పీలేరులో లయన్స్‌క్లబ్ హాస్పిటల్ నిర్మాణం, టీ. సుండుపల్లె ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం అభివృద్ధి చేయాలని కేంద్ర మంత్రికి విన్నవించగా పూర్తి వివరాలతో సమాచా రం ఇవ్వాలని మంత్రి సూచించినట్లు తెలిపారు.

రైలు ప్రమాదంలో తెగిపడిన యువకుడి చెయ్యి



ధనుష్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

నందలూరు, సెప్టెంబరు 16: రైల్వేకేంద్రంలో సోమవారం మధ్యాహ్నం రైలు కిందపడి యువకుడి చెయ్యి తెగిపడిపోయిన సంఘటన చోటు చేసుకుంది. గుంతకల్ వాసి కురుబ ధనుష్ పుత్తూరు సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ చదువుతున్నాడు. కాలేజీకి వెళ్లేందుకు గుంతకల్ నుంచి 12163 ఎక్స్‌ప్రెస్‌లో పుత్తూరుకు వెళుతుండగా రైలు నిలబడడంతో అతడు దిగి కదులుతున్న రైతులను మళ్లీ ఎక్కబోతూ ప్రమాదవశాత్తు రైలు కింద పడ్డాడు. దీంతో అతడి చెయ్యి పూర్తిగా తెగిపడిపోయింది. వెంటనే ఆర్పీఎఫ్ జీఆర్‌పీ సిబ్బంది క్షతగాత్రుడిని రాజంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఏఐటీయూసీది ఉజ్వల పోరాటాల చరిత్ర

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 16: ఏఐటీయూసీది దేశ చరిత్రలో ఉజ్వల పోరాటాల వారసత్వమని రాష్ట్ర అధ్యక్షుడు రావుల పల్లి రవీంద్రనాథ్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ప్యారడైజ్ ఫంక్షన్ హాలులో స్కీం వర్కర్ల రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతులు రెండో రోజు ముగిశాయి. కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏఐటియూసీ రాష్ట్ర నేతలు లలితమ్మ, మంజుల రమేష్ బాబు, స్రవంతి సుబాషిని, బాలక్రిష్ణ, శాంతి, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసు బ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇంట్లో వస్తువులు దగ్ధం

కడప (క్రైం), సెప్టెంబరు 16: కడప నగరం బీకేఎం స్ట్రీట్‌లోని అమ్మవారిశా ల వెనుక సోమవారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించినట్లు అగ్నిమాపక అధికారి బస్విరెడ్డి తెలిపారు. జాషు, కిసాన్ దంపతులు ఇంట్లో ఉండగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. దీంతో ఇంట్లోని సామగ్రి, జీడిపప్పు, బాదంపప్పు, బిర్యాని ఆకు కాలిపోయినట్లు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు మంటలను అదుపులోకి తెచ్చామని, బాధితుల ఫిర్యాదుపై దాదాపు రూ.50వేల మేర ఆస్తినష్టం జరిగినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

హత్య చేశారంటూ బంధువుల ఆరోపణ ● నడిరోడ్డుపై రాస్తారోకో



చెట్టుకు వెలాడుతున్న రమేశ్ మృతదేహం నడిరోడ్డుపై రాస్తారోకో చేస్తున్న మృతుని బంధువులు

పోరుమామిళ్ల, సెప్టెంబరు 16: పెట్రోలు బంకులో పనిచేసే లక్కినేని రమేశ్ (38) ఆర్‌అండ్‌బీ కార్యాలయం ఆవరణలో చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. ఆత్మహత్య చేసుకోలేదని హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని బంధువులు ఆరోపిస్తూ నడిరోడ్డుపై రాస్తారోకో చేశారు. ఎస్ఐ కొండారెడ్డి, సీఐ శ్రీనివాసులు వారిని శాంతిపజేసేందుకు ప్రయత్నించినా డీఎస్పీ వచ్చే వరకు రాస్తారోకో కొనసాగిస్తామంటూ డిమాండ్ చేశారు. చివరికి సీఐ హామీతో వారు రాస్తారోకో విరమించారు. వివరాలిలా.. స్థానిక మైదుకూరు రోడ్డులో ఉన్న పెట్రోలు బంకులో ఈదుళ్లపల్లె వాసి లక్కినేని రమేశ్ పంప్ ఆపరేటరుగా పనిచేస్తున్నాడు. పెట్రోలు బంకు పక్కనే ఉన్న ఆర్ అండ్‌బీ కార్యాలయం ఆవరణలో సోమవారం తెల్లవారుజామున వేపచెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. అతను చెట్టుకు వేలాడడం చూసిన మరో యువకుడు పోలీసులకు సమాచారం తెలిపారు. ఎస్ఐ కొండారెడ్డి సంఘటనా స్థలానికి వచ్చి మృత దేహాన్ని పరిశీలించి విషయం సీఐ శ్రీనివాస్‌కు తెలియజేశారు. వారు సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. ఈసమయంలో రమేశ్ ఆత్మహత్య చేసుకోలేదని ఎవరో హత్య చేశారని మృతుని కుటుంబసభ్యులు ఆరోపించారు. హత్య కేసుగా నమోదు చేసి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై రాస్తారోకో చేశారు. పోలీసులు జోక్యం చేసుకుని రాస్తారోకో విరమించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలని కోరినా వారు శాంతించలేదు, పెట్రోలుబంకు యాజమాన్యాన్ని కూడా విచారించాలని రమేశ్ మృతికి కారకులను కఠినంగా శిక్షించాలని డీఎస్పీ సంఘటనా స్థలానికి వచ్చి కారకులపై చర్యలు తీసుకోవాలని హామీ ఇవ్వాలని అంతవరకు రాస్తారోకో విరమించేది లేదని డిమాండ్ చేస్తూ రాస్తారోకో కొనసాగించారు. దీంతో టీడీపీ నేత కొండా రామక్రిష్టారెడ్డి చొరవ తీసుకుని ఒప్పించడం, సీఐ మృతుని బంధువులకు హామీ ఇవ్వడంతో పోస్టుమార్టం కోసం వారు అంగీకరించారు. పోస్టుమార్టం రిపోర్టు వచ్చిన తరవాత చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పంచనామా పూర్తి కాకపోవడంతో మంగళవారం పోస్టుమార్టం నిర్వహించే అవకాశం ఉంది. మృతుని కుటుంబ సభ్యులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

రామాపురం కేంద్రంగా ఇసుక అక్రమ రవాణా

గ్రామంలో ఇసుకలోడు ట్రాక్టర్లు పట్టివేత

ఎమ్మెల్యే వర్గీయుల మంటూ హూంకరింపు



ఇసుకలోడు ట్రాక్టరును పరిశీలిస్తున్న రూరల్ పోలీసులు

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 16: పొద్దుటూరులో ఇసుక అక్రమ రవాణా ఆగడం లేదు. వైసీపీ ప్రభుత్వంలో ఇసుక అక్రమ రవాణా సాగించిన తరహాలో నేడు టీడీపీ ఎమ్మెల్యే వర్గీయులు కొందరు ఇసుక అక్రమ రవాణాను నడిపిస్తున్నారు. ఎస్పీ హర్షవర్ధన్ ఇసుక అక్రమ రవాణా, మట్కా, క్రికెట్ బెట్టింగ్, జూదం, పేకాటను ఉపేక్షించేది లేదని బహిరంగ ప్రకటన చేసినా ఆయన హెచ్చరికలను ఖాతరు చేయకుండా ఇసుక మాఫియా రామాపురం కేంద్రంగా అక్రమ రవాణా సాగిస్తోంది. ప్రొద్దుటూరులో డీస్పీ సహా అన్ని స్టేషన్ల సీఐలు ఎస్ఐలు మారినా ఇసుక అక్రమ రవాణా తీరులో ఏమాత్రం మార్పులేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. కొత్తగా వచ్చిన పోలీసులకు సమాచారం అంది ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునే చర్యలకు దిగితే తాము ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి వర్గీయులమంటూ పోలీసులను సైతం బెదిరిస్తున్నట్లు సమాచారం. సోమవారం రామాపురం కేంద్రంగా ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని అందిన సమాచారంతో పోలీసులు పెట్రోలింగ్ వెళ్లే సరికి ఇసుక లోడు ట్రాక్టర్లను నేరుగా రామాపురంలోని తమ ఇళ్లవద్ద వుంచారు. ఇసుకలోడుతో వున్న నాలుగు ట్రాక్టర్లను రూరల్ పోలీసు స్టేషనుకు తీసుకురావాలని పోలీసులు ఆదేశించారు. అయితే ఇసుకను డంపుల్లో అన్‌లోడ్ చేసి ఖాళీ ట్రాక్టర్లను వుంచుకున్నారు. ఒకవైపు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి తన వర్గీయులైనా సరే ఇసుక అక్రమరవాణాకు పాల్పడితే చర్యలు తీసుకోమని ఆయన బహిరంగ ప్రకటన చేశారు. దీంతో పోలీసులు కూడా టీడీపీ నేతలవని ఎక్కడా ఇసుక ట్రాక్టర్లను పట్టుకోకుండా వదిలిన దాఖలాలు పెద్దగా లేవు. కానీ సోమవారం రామాపురంలో ఇసుకలోడుతో వున్న ట్రాక్టర్లు పట్టుకుని వాటిని పరిశీలించి, విచారించి స్టేషనుకుతీసుకు రమ్మన్నా పోలీసుల మాటలను ఖాతరు చేయకుండా ఇసుకను డంపుల్లో అన్‌లోడు చేసి ట్రాక్టర్లను ఖాళీగా వుంచుకోవడంతో పోలీసులు ఖంగుతిన్నారు. దీనిపై రూరల్ ఎస్ఐ మహ్మద్ రఫీని వివరణ కోరగా సీఐ సహా మేమంతా మరో డ్యూటీలోవున్నాం. మా పోలీసులు పెట్రోలింగ్ వెళితే ఇంటివద్ద లోడుతో ట్రాక్టర్లు పెట్టుకున్నారు. వాటిని స్టేషనుకు తీసుకురమ్మని చెప్పివచ్చారు. వారంతా మా నోటీసులో వున్నారు. వారిపై చర్యలు ఎలా తీసుకోవాలో తీసుకుంటామని తెలిపారు.

ముగ్గురు గంజాయి విక్రేతలు అరెస్టు

రెండున్నర కిలోలు స్వాధీనం

పోరుమామిళ్ల, సెప్టెంబరు 16: గంజాయి అమ్ముతున్న ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని రెండున్నర కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ రంపాడు రోడ్డులో గంజాయి అమ్ముతున్న ఆసిఫ్, వెంకటయ్య, మహ్మద్ గౌస్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండుకు పంపుతున్నట్లు తెలిపారు.

బాస్కెట్‌బాల్ పోటీలకు కడప విద్యార్థినులు



కడప (స్పోర్ట్స్) సెప్టెంబరు 16: వేంపల్లి గురుకుల పాఠశాలలో నిర్వహించిన స్కూల్ గేమ్స్‌లో అండర్-19 బాస్కెట్ బాల్ రాష్ట్ర పోటీలకు యశస్విని, రిజ్వానా ఎంపికైనట్లు గాయత్రి జూనియర్ కళాశాల ఫౌండర్ పురుషోత్తంరెడ్డి వెల్లడించారు. వీరు అక్టోబర్‌లో శ్రీకాకుళంలో జరగనున్న రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు జిల్లా జట్టు తరపున పాల్గొననున్నట్లు వెల్లడించారు.

కుక్కల దాడి బాలుడికి గాయాలు

మైదుకూరు రూరల్, సెప్టెంబరు 16: సర్వాయపల్లె రోడ్డులో సోమవారం కుక్కలు వెంటపడడంతో బాలుడు గాయపడ్డాడు. కుక్కలు వెంటపడడంతో బాలుడు పరిగెత్తినా ఒక కుక్క వెంబండించి కరిచింది. పరిగెత్తడంతో బాలుడు కింద పడి నోట్లోని పండ్లు విరిగిపోయాయని తల్లిదండ్రులు వాపోయారు.

టైలింగ్ పాండ్ నిర్వహణలో యూసీఐఎల్ నిర్లక్ష్యం

వేముల, సెప్టెంబరు 16: వేముల మండలం ఎం.తుమ్మలపల్లె వద్ద ఉన్న యురేనియం సంస్థ నుంచి వెలువడే వ్యర్థాలను నిల్వ చేసేందుకు ఏర్పాటు చేసిన టైలింగ్ పాండ్ నిర్వహణలో యూసీఐఎల్ సంస్థ నిర్లక్ష్యం వహిస్తోందని కేకేకొట్టాల గ్రామస్తులు వాపోతున్నారు. ఆరు నెలల్లో రెండోసారి ఈ టైలింగ్ పైపులు లీకేజీ అయ్యాయి. యురేనియం వ్యర్థాలు పంట పొలాల్లోకి వస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం కేకే కొట్టాల గ్రామం సమీపంలో పైపులు లీకేజీ కావడంతో యురేనియం వ్యర్థాలు రైతుల పొలాల్లోకి లీక్ అయ్యాయి. గ్రామస్తులు విషయాన్ని యురేనియం అధికారులకు తెలిపారు. వారు మరమ్మతులు చేయడానికి రాగా.. అధికారులను స్థానిక ప్రజలు అడ్డుకున్నారు. 2009 నుంచి తమ సమస్యలకు పరిష్కారం చూపకుండా నిత్యం ఇలా వ్యర్థ పదార్థాలను వదిలేస్తూ తమ ప్రాణాలకు ముప్పు తెస్తున్నారని అధికారులను నిలదీశారు. దీంతో ఉదయం సంస్థ అధికారులు పులివెందుల డీఎస్పీ మురళీనాయక్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన స్థానిక రైతులతో సమస్య గురించి అడిగి తెలుసుకున్నారు.ఈ సమస్య ఇప్పటిది కాదని, యురేనియం అధికారులకు అనేకమార్లు తెలిపినా చర్యలు చేపట్టలేదని వాపోయారు. ఆరేళ్ల కిందట అప్పటి యురేనియం సంస్థ సీఎండీ అన్సారి కూడా ఈ టైలింగ్ పాండ్ వ్యర్థాలతో జరిగిన నష్టాన్ని పరిశీలించేందుకు వచ్చారని డీఎస్పీకి వివరించారు. సంస్థ నిర్వాకంతో సారవంతమైన భూములు బీడు భూములుగా మారాయని, రేడియేషన్ వల్ల అనారోగ్యాలకు గురవుతున్నామని, సంస్థ వారు తమ భూములు కొనుగోలు చేసి నష్ట పరిహారం అందిస్తే ఊరు వదిలి వెళ్లిపోతామని ధర్నాలు చేసినా అధికారుల్లో చలనం లేదన్నారు. డీఎస్పీ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో అక్కడి నుంచి రైతులు వెనుదిరిగారు.

భక్తిశ్రద్ధలతో ఏకదంతుడి నిమజ్జనం

రాయచోటిటౌన్, సెప్టెంబరు 16: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా సోమవారం పలు ప్రాంతాల్లో వినాయకుడి విగ్రహాల ఊరేగింపు, నిమజ్జనం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఎస్‌ఎన్ కాలనీలోని ఉమా మహేశ్వరస్వామి ఆలయంలో వినాయక నవరాత్రులను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయక పంచలోహ విగ్రహాలను వివిధ రకాల పుష్పాలు, పట్టువస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి ఊరేగించారు. మానవత చైర్మన్ అరమాటి శివగంగిరెడ్డి, ప్రధాన అర్చకుడు నటరాజస్వామి, గంగాధర్‌నాయుడు ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు అందజేశారు. కొత్తపేట, జగదాంబ సెంటర్, రాజు స్కూల్, కొత్తపేట రామాపురం, మాసాపేట తదితర ప్రాంతాల్లో వినాయకుడి విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు, పలు విగ్రహాల వద్దకు వెళ్లి పూజలు నిర్వహించి, ప్రజలకు అన్నదానం చేశారు.



ఊరేగుతున్న పంచలోహ మహాగణపతి



రాయచోటి:కొత్తపేట జగదాంబ సెంటర్ నుండి వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తున్న గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు

రూ48,116 పలికిన లడ్డూ

గాలివీడు: మండల కేంద్రంలోని చెక్కావాండ్లపల్లె వినాయకుడి లడ్డు రూ.48,116కు రేవనూరి రాజ్‌కుమార్ దక్కించుకున్నారు. గ్రామంలో సోమవారం నిమజ్జనం సందర్భంగా శోభాయాత్ర నిర్వహించారు.

నందలూరులో 36 వేలు..

నందలూరు: మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామంలోని కాపువీధి వద్ద ఏర్పాటు చేసిన వినాయస్వామి లడ్డూను ప్రదీప్‌కుమార్ 36 వేలకు వేలంలో దక్కించుకున్నారు. అనంతరం స్వామివారి నిమజ్జనాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆదినారాయణ, కవిత, దేవి, అమ్మి, స్వర్ణలత, సురేష్, పత్తి, మంజు, నితిన్, సురేష్, అబ్బు, మంజు, శివ, సుదర్శన్, నాని, బాబీ, హరి, కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, నాగయ్య, ఎముక దుర్గయ్య, టైలర్ నాగయ్య, మణి తదితరులు ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

సుండుపల్లెలో 25 వేలు..

సుండుపల్లె: మండలంలోని మాచిరెడ్డిగారిపల్లె గ్రామ పంచాయతీ కటారుముడుకులో ఏర్పాటు చేసిన వినాయకుని మండపం వద్ద నిర్వహించిన లడ్డును అదే ఊరికి చెందిన బంగారప్పనాయుడు రూ.25 వేలకు వేలంలో దక్కించుకున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు.



గాలివీడు: వినాయకుడి లడ్డు తీసుకెళుతున్న రేవనూరి రాజ్‌కుమార్



నందలూరు లడ్డూతో ప్రదీప్‌కుమార్



సుండుపల్లి: వేలంలో వినాయకుడి లడ్డు దక్కించుకున్న బంగారప్పనాయుడు కుటుంబ సభ్యులు

అనంతరం వినాయకుడి మండపం వద్ద పూజలు చేసి టెంకాయలు కొట్టారు. అనంతరం తీర్థప్రసాదాలను పంచిపెట్టారు.

ప్రహరీ గోడకు మరమ్మతులు చేయండి



కూలిపోయిన పాఠశాల రక్షణ గోడ

గాలివీడు, సెప్టెంబరు 16: కరమి రెడ్డిగారిపల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కూలిన ప్రహరీగోడకు మరమ్మతులు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. గాలివీడు మండలంలోని గోరాన్‌చెరువులో ఉన్న కరిమిరెడ్డిగారిపల్లె ప్రధాన రహదారి పక్కనే ఉన్న ప్రభుత్వ పాఠశాలలో ఐదేళ్ల క్రితం ప్రహరీగోడ కూలిపోయింది. దీంతో కొందరు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మార్చుకున్నారు. మరోవైపు పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోవడంతో విషసర్పాలకు అవాసంగా మారింది. ఇలాంటి వాతావరణంలో విద్యార్థులు పాఠశాల ఆవరణంలో తిరగాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రహరీ గోడ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

చేనేతల సమస్యలు పరిష్కరించాలి

గాలివీడు, సెప్టెంబరు 16: రాష్ట్ర వ్యాప్తంగా చేనేత పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరి ష్కరించాలని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఓర్సు వీరభాస్కర్ డిమాం డ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సో మవారం గాలివీడు మండ లం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్ను కున్నట్లు తెలిపారు. మండల అధ్యక్షుడుగా శిబ్యాల వెంకట్రమణ, కార్యదర్శి మోడెం రాము, ఉపాధ్యక్షుడు పురం కృష్ణమూర్తి, ఓర్సు ఆంజనేయులు, కార్యవర్గ సభ్యులు ఓర్సు పవన్‌కుమార్, ప్రసాద్, నాగయ్య, లక్ష్మినారాయణ, జయరాంను ఎన్నుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె, రాయచోటి, గాలి వీడు తదితర మండలాల్లో చేనేతల సమస్యలను పరిష్కరించాలన్నారు. 11 రకాల చేనేత వస్త్ర ఉత్పత్తుల రిజర్వేషన్ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని, నేతన్న నేస్తం పథకాన్ని 24 వేల నుండి 48 వేలకు పెంచాలని, చేనేత వస్త్ర ఉత్పత్తులకు ప్రభుత్వమే మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ ఆస్పత్రి వద్ద బాడీ ఫ్రీజర్ ఏర్పాటు

రైల్వేకోడూరు, సెప్టెంబరు 16: పేదల సౌకర్యార్థం ప్రభుత్వ ఆస్పత్రి వద్ద బాడీ ఫ్రీజర్‌ను ఏర్పాటు చేసినట్లు మానవత స్వ చ్ఛంద సేవా సంస్థ చైర్మన్ కీర్తి పాటి ప్రసాద్‌వర్మ సోమవారం తెలిపారు. రైల్వే కోడూరు పరిసర ప్రాంతాలకు చెందిన పేదలు సౌకర్యాన్ని ఉపయోగిం చుకోవచ్చునని తెలిపారు. ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు 9492561669, 92907 60996, 9989589190 అనే నెంబర్లకు ఫోన్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టి. వెంకటరమణయ్య, సి. నాగేంద్ర, పి. ఉదయ్‌శంకర్‌రెడ్డి, మందల రామకృష్ణ, ఏ. శ్రీని వాసులు, సి. శ్రీనివాసులు, ఎగ్జిక్యూటివ్ కమిటీ అధ్య క్షుడు యం. చంద్రమోహన్ రాజు, కోశాధికారి పొన్నూరు నిరంజన్‌బాబు పాల్గొన్నారు.



బాడీ ఫ్రీజర్‌తో మానవత నిర్వాహకులు

గంగనపల్లికి ఘన సత్కారం

రాజంపేట, సెప్టెంబరు 16: పట్టణానికి చెందిన తెలుగు పండితుడు, కవి గంగనపల్లి వెంకటరమణ తెలుగు భాషా వికాసానికి చేస్తున్న కృషికి గుర్తింపుగా బద్వేలులో ఘన సన్మానం అందుకున్నారు. మొల్ల సాహితి పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు జన్మదినం సందర్భంగా బద్వేలులోని విశ్రాంత ఉద్యోగుల సంఘ సమావేశ మందిరంలో సోమవారం ఆయనను శాలువా, పూలమాల, జ్ఞాపిక, ప్రశంసాపత్రాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరుకు చెందిన తిక్కన మహాకవి లలితా కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు, విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు ఆలూరు శిరోమణిశర్మ, రాయచోటికి చెందిన అవధాని లోకజగన్నాథ శాస్త్రి, దేవీ ఉపాసకుడు మాడుగుల శివశ్రీశర్మ తదితరులు పాల్గొన్నారు.



గంగనపల్లి వెంకటరమణను సన్మానిస్తున్న కవి పండితులు

కార్యసిద్ధి వినాయకుడికి వెండి జంధ్యం సమర్పణ

పెనగలూరు, సెప్టెంబరు 16 : మండల కేంద్రంలోని పి.కొత్తపల్లె లో నిర్మించిన కార్యసిద్ధి వినాయక స్వామి మూలవిరాట్‌కు అలంక రించేందుకు ఇదే గ్రామానికి చెం దిన దొడ్ల నరేష్‌రెడ్డి, శ్రీదేవి దంపతులు 30 వేల రూపాయలు విలువ చేసే వెండి జంధ్యంను సోమవారం దేవాలయ కమిటీ సభ్యులకు అందజేశారు. మండల పూజల్లో భాగంగా సోమవారం ఉదయం పూజ ముగిసిన తర్వాత ఈ కానుకను అందజేశారు. ఈ కార్యక్రమంలో నరేష్‌రెడ్డి, శ్రీదేవి కుటుంబ సభ్యులు సుశీలమ్మ, అపర్ణ, నాని తదితరులు పాల్గొన్నారు.



వెండి జంధ్యం సమర్పిస్తున్న నరేష్‌రెడి కుటుంబ సభ్యులు


ఈ క్రాప్ నమోదు గడువు పొడిగించాలి

లక్కిరెడ్డిపల్లె సెప్టెంబరు 16: ఈ క్రాప్‌లో పంట వివరాల నమోదుకు గడువు పొడిగించాలని జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మండలంలోని కుర్నూతల గ్రామంలో ఎండిపోయిన వేరుశనగ పైరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వరదలు బీభత్సం సృష్టిస్తుంటే, అన్నమయ్య జిల్లాలో మాత్రం వర్షం కురవక వేరుశనగ ఎండిపోతోందన్నారు. ఈ పరిస్థితుల్లో వ్యవయశాఖ అధికారులు మాత్రం ఈ క్రాప్ నమోదు కార్యక్రమాన్ని సెప్టెంబర్ 15కే నిలిపివేశారని, ఇప్పటికీ చాలా మంది రైతులు ఈ క్రాప్ నమోదు చేయించలేదని, జిల్లా వ్యవసాయ అధికారులు ఈ సమస్యను గుర్తించి క్రాప్ నమోదు గడువును సెప్టెంబరు ఆఖరు వరకు పొడిగించాలని కోరారు.



ఎండిపోయిన వేరుశనగ పైరును పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకుడు రంగారెడ్డి

ఆలయ పాలకవర్గం ఏర్పాటుకు వినతి



శివాలయంలో భక్తులతో మాట్లాడుతున్న ఈవో కొండా రెడ్డి

సుండుపల్లి, సెప్టెంబరు 16: మండల కేంద్రంలోని విరూపాక్ష చెన్నకేశవ స్వామి ఆలయ పరిధిలోని శివాలయానికి పాలకవర్గాన్ని నియమించాలంటూ స్థానిక భక్తులు దేవాదాయ శాఖ ఈవో కొండారెడ్డికి సోమవారం వినతి పత్రాన్నిఅందజేశారు. అలాగే ఆలయ పూజారిని మార్చాలన్నారు. ఆలయం అభివృద్ధికి పాటు పడేవారిని ఆలయ కమిటీ చైర్మన్‌గా ఎంపిక చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఆలయంలో గడ్డిని తొలగించి భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. సోమవారం ఉదయం గుడిలోని గడ్డి, పిచ్చి మొక్కలను తొలగిస్తుండడంతో భక్తులకు పూజారి కుటుంబీకులతో వాగ్వాదం జరిగింది. ఇరువురు ఒకరిపై ఒకరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. ఈ విషయంపై దేవదాయ శాఖ ఈవో కొండారెడ్డి విచారణ చేశారు. అధికారులతో మాట్లాడి నూతన పాలకవర్గాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.

వైభవంగా వీరభద్రుడి పల్లకి ఉత్సవం



పల్లకిపై ఊరేగుతున్న భద్రకాళీ సమేత వీరభద్రుడు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 16: పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో సోమవారం పల్లకి ఉత్సవం నిర్వహించారు. భద్రకాళి, వీరభద్రుడి ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలు, పట్టు వస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి పల్లకిపై ఆసీనులను చేసి ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. ఆలయ ఈవో డీవీ రమణారెడి, ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు

నేడు ఈటిమాపురం ఫీడర్ పరిధిలో కరెంట్ కోత

పెనగలూరు, సెప్టెంబరు 16 : పెనగలూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఈటిమాపురం ఫీడర్‌లో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ సయ్యద్ షఫీ తెలిపారు. తూర్పుపల్లె, గట్టువారి పల్లె, వెలకచర్ల, నాయుడుగారిపల్లె, మూగవారిపల్లె తదితర గ్రామాల పరిదిలో ఉన్న విద్యుత్ తీగల కింద కొమ్మల తొలగింపు, లైన్ల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

రాజంపేట టౌన్, సెప్టెంబరు 16 : విద్యారులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే చక్కటి భవిష్యత్ ఉంటుందని ద్రోణాచార్య మార్షల్ ఆర్ట్స్ అకాడమీ గ్రాండ్‌మాస్టర్ బి.సునీల్ తెలిపారు. ఆదివారం కడపలో జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను సోమవారం జీఎంసీలోని మార్షల్ ఆర్ట్స్ అకాడమీలో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సబ్‌జూనియర్ విభాగంలో ఎం.ప్రతీక్, వై.దక్షిత, కె.లేఖ్య, కె.పునీత్, జూనియర్ విభాగంలో బి.గౌతమ్, ఎం.రితేష్(నాని)లు స్వర్ణ పతకాలు సాధించారని టి. కోమల్, వాఫిక్, యువన్ సాయిక్రిష్ణ, సాయిసాత్విక్‌లు రజతం, కె.బాలాజీ, కె.లాలిత్య, హలర్ కాంస్యపతకాలు సాధించినట్లు తెలిపారు. తైక్వాండో సాధనతో ఆరోగ్యంతో పాటు ఆత్మరక్షణ, విద్య, ఉద్యోగాల్లో మెరుగైన అవకాశాలు లభిస్తాయని తెలిపారు.

రోడ్డు ప్రమాంలో ఇద్దరికి గాయాలు

రైల్వేకోడూరు, సెప్టెంబరు 16 : బైక్‌పై వెళుతూ ట్రాక్టర్‌ను ఢీకొని ఇద్దరు గాయపడ్డారు. మన్నూరు కన్నెగుంట ఎస్టీ కాలనీకి చెందిన ఈశ్వరమ్మ మరో వ్యక్తితో కలసి సోమవారం రాత్రి బైక్‌పై తిరుపతి నుంచి కోడూరు వైపునకు వస్తూ ఉప్పరపల్లి పంచాయతీ మారావారిపల్లి వద్ద ముందు వెళుతున్న ట్రాక్టర్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో గాయపడిని వారిద్దరినీ స్థానికులు గుర్తించి 108 వాహనంలో కోడూరులోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు

స్వగృహ కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, సెప్టెంబరు 16: పట్టణంలోని ఆనంద నిలయ స్వగృహ కాలనీలో మౌలిక వసతులు కల్పిస్తామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం మంత్రి మండిపల్లి ఆనంద నిలయ స్వగృహ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆనంద నిలయ స్వ గృహ కాలనీలోని ప్రజలు, ఉద్యోగులు, నివాసితులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభు త్వం దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఈ కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, కరెంటు, వీధిలైట్లు వంటి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామంలో శ్మశాన వాటికలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఆనంద నిలయ స్వగృహ కాలనీలో శ్మశాన వాటికకు స్థలం కేటాయిస్తామన్నారు. ట్రాన్స్‌కో అధికారులతో మాట్లాడి వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తామన్నారు. కరెంటు మీటర్ల సమస్యలు ఉన్నట్లయితే వెంటనే ట్రాన్స్‌కో అధికారులకు తెలియజేసి ప్రతి ఒక్కరు తమ ఇంటికి మీటర్లు బిగించుకోవాలన్నారు. కాలనీలో మురుగు కాలువలు ఏర్పాటు చేయిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆనంద నిలయ స్వగృహ కాలనీ ప్రజలు మంత్రికి పలు సమస్యలపై అర్జీలు సమర్పించారు.

జమాలుల్లా బాబా దర్గాలో ప్రార్థనలు

మిలాదున్నబీ సందర్భంగా పట్టణంలోని జమాలుల్లా బాబా దర్గాలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా తదితర ముస్లిం మైనార్టీ సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జమాలుల్లా బాగా దర్గాపై చాదర్ కప్పి మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా అక్కడికి వచ్చిన ప్రజలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు ఖద్రుజమానైఫ్, బంగారు అంగడి యజమాని ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



మంత్రి మండిపల్లిని సన్మానిస్తున్న కాలనీ వాసులు

రాజంపేటలో ఘన స్వాగతం

రాజంపేట: నియోజకవర్గంలోని ఓబులవారిపల్లెలో ప్రభుత్వ కార్యక్రమాలకు వెళుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్, టీడీపీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు మల్లెల శ్రీవాణి, బీసీ నాయకులు మల్లెల సుబ్బరాయుడు ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. భారీ గజమాల వేసి శాలువాలు కప్పి ఆయనను స్వాగతించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట టీడీపీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ తుపాకుల అశోక్, టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వేణుగోపాల్, యువ నాయకులు మల్లెల సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

రాజంపేట మండలం మన్నూరు అరుంధతివాడలో వినాయకుడి నిమజ్జనం సందర్భంగా టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మందా శ్రీనివాసులు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. యువకులకు తన సొంత నిధులతో వినాయకుని చిత్రం ఉన్న 50 టీషర్టులు పంపిణీ చేశారు.

వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి జన్మదినం సందర్భంగా అన్నదానం



రాయచోటి: రోగులకు అన్నదానం చేస్తున్న బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాసకుమార్‌రాజు



నందలూరు: రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎన్డీయే నాయకులు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 16: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ పుట్టినరోజు సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, డయాలసిస్ సెంటర్లలో సుమారు 100 మందికి, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ పాలగిరి శ్రీనివాసరాజు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యకుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి కేక్ కట్ చేశారు. రాయచోటి అసెంబ్లీ కన్వీనర్ నిర్మల్‌కుమార్, ధీరజ్, బత్తుల హరిబాబు, ప్రవీణ్, రోషన్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

నందలూరు: భారతీయ జనతాపార్టీ జాతీయ కార్యదర్శి ఆంధ్ర రాష్ట్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ మంత్రి వై.సత్యకుమార్‌యాదవ్ జన్మదినం సందర్భంగా మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో బీజేపీ సీనియర్ నాయకులు హిమగిరినాథ్‌యాదవ్, ఎన్డీయే కూటమి నాయకుల ఆధ్వర్యంలో సోమవారం రోగులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మైనార్టీ నాయకులు షబ్బీర్‌అహ్మద్, నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ, ఎస్సీ నాయకులు మోడపోతుల రాము, జనసేన పార్టీ నాయకులు గురివిగారి వాసు, బీజేపీ నాయకులు చిన్నరాయుడు, మురళి, జైకుమార్‌రెడ్డి, మాచుపల్లె హరిబాబు, టీడీపీ నాయకులు మౌలా మెహర్, హరి తదితరులు పాల్గొన్నారు.

'అన్నమయ్య' డీఎఫ్‌వోపై చర్యలు తీసుకోవాలి

సిద్దవటం, సెప్టెంబరు 16 : డీఎఫ్‌వోపై చర్యలు తీసుకోవాలని రాజంపేట జనసేనపార్టీ సమన్వయకర్త అతికారి దినేష్ డిమాండ్ చేశారు. సిద్దవటంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుత ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, అటవీశాఖ మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేటీ ఎంపీ మిథున్‌రెడ్డి చెబితేనే డీఎఫ్‌వో గ్రావెల్ మైనింగ్ చేయించారేమోనని వెల్లడించాలని తెలిపారు. గత వైసీపీ పాలనలో రిజర్వ్ ఫారెస్టులో 200 మీటర్ల రేడియస్‌లో పాలకొండను తవ్వి, చెయ్యేరు గ్రావెల్ మైనింగ్ చేసి రోడ్లు వేశారన్నారు. ఇసుకరీచ్ పేరుతో ఇసుక తరలింపుకు పాల్పడ్డారన్నారు. కొండలను తవ్వేసి ప్రకృతిని నాశనం చేయడంపై తాను గతంలో డీఎఫ్‌వో వివేక్‌కు అర్జీ ఇచ్చేందుకు ప్రయత్నించగా, ఆయన తీసుకోకపోగా, పరుష పదజాలంతో దూషించాడన్నారు. ఇటీవల పవన్‌కళ్యాణ్ రాజంపేట పర్యటనకు విచ్చేసినప్పుడు ఆర్ అండ్ బి బంగ్లాలో డీఎఫ్‌వో వివేక్‌పై ఫిర్యాదు చేయడంతో విచారణకు అదేశించారన్నారు. దీంతో స్పెషల్ స్క్వాడ్ డీఎఫ్‌వో శివకుమార్ విచారణ చేశారన్నారు

సంక్షేమ హాస్టళ్లలో సమస్యలను పరిష్కరించాలి

రైల్వేకోడూరు, సెప్టెంబరు 16: విద్యారంగ పరిరక్షణకు విద్యార్థులు ఉద్యమించాలని, సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాధవ్ తెలిపారు. సోమవారం రైల్వేకోడూరు సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యం అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటా్లడుతూ విద్యార్థుల సమస్యలపై నిరంతరాయంగా పోరాటాలు చేస్తున్నామని తెలిపారు. విద్య అంగడిలో సరుకులాగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. హాస్టల్‌లో ఉన్న పేద విద్యార్థులకు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని తెలిపారు. మౌలిక సదుపాయలు కల్పించకుంటే ఆందోళనలు చేయా ల్సి వస్తుందన్నారు. విద్యార్థి వ్యతిరేక విధానాలకు ప్రభుత్వాలు స్వస్తి పలకాలని కోరారు. రాష్ట్ర, కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి మరిన్ని నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం నియోజకవర్గ ఏఐఎస్‌ఎఫ్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా నాగేంద్ర, కార్యదర్శిగా ప్రవీణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు తుమ్మల కృష్ణచైతన్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

వెంకన్న ఆలయ ఆభరణాలు తనిఖీ

తంబళ్లపల్లె, సెప్టెంబరు 16: మండలంలోని కోసువారిపల్లె ప్రసన్న వేంకటరమణ ఆలయానికి సంబంధించిన ఆభరణాలను టీటీడీ గోల్డ్ వెరిఫికేషన్ అధికారులు, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్ మునిబాలకుమార్, మునిచెంగల్రాయులు సోమవారం పరిశీలించారు. అన్ని ఆభరణాలు సవ్యంగా ఉన్నట్లు వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిశంత్‌కుమార్, సిబ్బంది నగేష్ పాల్గొన్నారు.

ఏఐఎఫ్‌టీవో కార్యదర్శిగా గిరిప్రసాద్



చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 16: ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ టీచర్స్ ఆర్గనైజేషన్ (ఏఐఎఫ్‌టీవో) కార్యదర్శిగా ఏఎం గిరిప్రసాద్ ఎన్నికయ్యారు. సోమవారం లక్నోలో ఏఐఎఫ్‌టీవో జాతీయ స్థాయి టీచర్ల సమావేశం నిర్వహించింది. విద్యారంగం, టీచర్ల సమస్యలు, వాటి పరిష్కారాలపై చర్చలు జరిగాయి. అనంతరం నూతన కార్యవర్గ ఎన్నికలో జిల్లాకు చెందిన పీఆర్‌టీయూ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏఎం గిరిప్రసాద్‌ను జాతీయ స్థాయి కార్యదర్శి స్థానానికి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీనిపై పలువురు పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకులు హర్షం వ్యక్తం చేసి, అభినందనలు తెలిపారు.

బస్సులో బంగారం చోరీ



విచారిస్తున్న పోలీసులు
(ఇన్‌సెట్లో) బాధితురాలు

చిత్తూరు, సెప్టెంబరు 16: బస్సులో ఓ మహిళ బ్యాగులో ఉన్న బంగారం చోరీ అయిన సంఘటన సోమవారం ఆర్టీసీ బస్టాండు వద్ద జరిగింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. తిరుపతికి చెందిన ప్రేమ అనే మహిళ కుటుంబం బెంగళూరులో స్థిరపడింది. రెండ్రోజుల కిందట తిరుపతిలో పెళ్లి ఉండటంతో కుటుంబంతో కలిసి వచ్చారు. పెళ్లి చూసుకుని సోమవారం సాయంత్రం కర్ణాటక ఆర్టీసీ బస్సులో బెంగళూరుకు బయల్దేరారు. బస్సు చిత్తూరుకొచ్చాక బంగారు నగలున్న బ్యాగు కనడపడలేదు. దీంతో ఆమె చుట్టుపక్కల ఉన్న వారిని అడిగినా ఫలితం లేదు. అప్పటికే బస్సు చిత్తూరు ఒకటో పట్టణ పోలీసుస్టేషన్ వద్దకు చేరింది. ఈ విషయాన్ని పోలీసులకు బాధితులు చెప్పారు. పోలీసులు కూడా ప్రయాణికులను తనిఖీ చేశారు. వారి వద్ద బ్యాగు లేకపోవడంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దొంగల కోసం గాలిస్తున్నారు. కాగా.. గిల్ట్ నగలున్న బ్యాగు మాత్రమే తమ ఉందని బాధితులు చెబుతున్నారు. దీంతో బంగారం నగలను మర్చిపోయి తిరుపతిలోనే వదిలేశారా లేదా మరెక్కడైనా పెట్టేశారా చూడాలని పోలీసులు చెప్పడంతో బాధితులు ఫిర్యాదు ఇవ్వకుండానే వెళ్లిపోయారు.

డయాలసిస్ సెంటరు లేక రోగుల అవస్థలు



పలమనేరులోని వంద పడకల ఆసుపత్రి నూతన భవనం

పలమనేరు, సెప్టెంబరు16 : నియోజకవర్గ కేంద్రంలో డయాలసిస్ సెంటరు ఏర్పాటు చేయాలని పలువురు కిడ్నీ వాధి బాధితులు కోరుతున్నారు. నియోజకవర్గ పరిధిలో పలమనేరు, గంగవరం, బైరెడ్డిపల్లి, పెద్దపంజాణి మండలాలతోపాటు స్థానిక మున్సిపాలిటీలో ఆ బాధితులు ఎక్కువ మంది ఉన్నారు. వీరిలో కొందరు వారానికి ఒకసారి, మరికొందరు రెండుపర్యాయాలు, మరికొందరు మూడు పర్యాయాలు డయాలసిస్ చేసుకుంటున్నారు. ప్రస్తుతం కోలారు, బెంగళూరు, తిరుపతి, కుప్పం పీఈఎస్ మెడికల్ కళాశాలలకు వెళ్ళాల్సి వస్తోంది. ఒకసారి ప్రయివేటు ఆసుపత్రుల్లో డయాలసిస్ చేసుకోవాలంటే కనీసం రూ.3వేల నుంచి రూ.4500 వరకూ వ్యయం అవుతోంది. ఇంత పెద్ద మొత్తంలో ఖర్చు చేయకోలేక చాలా మంది అప్పుల పాలవుతున్నారు. డయాలసిస్ సెంటరులో ఏమాత్రం ఇబ్బంది ఎదురైనా పేషెంట్ ఆరోగ్యం మరింత క్షీణించి ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుంది. నియోజకవర్గంలో దాదాపు 100 మందికి పైగా ఉన్న ఆర్ఎంపీ వైద్యులు మిడిమిడి జ్ఞానంతో రాసిచ్చే యాంటీబయోటిక్స్ కూడా రోగులను మరింత అనారోగ్యం బారిన పడేస్తోందనే విమర్శలున్నాయి. ఎంబీబీఎస్ వైద్యుల వద్దకు వెళ్లే ఆర్థిక స్తోమతు లేక పేదలు ఈ ఆర్ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. వీరు అవసరమున్నా లేకున్నా ప్రైవైట్ వైద్యులు ఎక్కువగా మందులు రాస్తున్నారని కొందరు రోగులు ఆవేదన చెందుతున్నారు. అధికమందుల ప్రభావంతో కిడ్నీ వ్యాధులు పెరిగిపోతున్నాయని వాపోతున్నారు. తమ ఇబ్బందులను తొలగించేందుకు పలమనేరులో ప్రభుత్వం డయాలసిస్ కేంద్రం ఏర్పాటుచేయాలని వ్యాధిగ్రస్తులు కోరుతున్నారు. పలమనేరు వంద పడకల ఆసుపత్రి ఇందుకు అనువుగా ఉంటుందని సూచిస్తున్నారు.

నిశ్చితార్థ వేడుకల కోసం క్యూలైన్ల తొలగింపు

- పల్లికొండేశ్వరాలయంలో వైసీపీ నేత నిర్వాకం



ప్రదోష మండపం వద్ద కట్ చేసిన గ్రిల్ అడుగు భాగం

నాగలాపురం, సెప్టెంబరు 16 : సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయంలో మాజీ ఛైర్మన్ ఏపీఎం బాలాజీరెడ్డి మరో నిర్వాకం వెలుగు చూసింది. ప్రదోష మండపంలో తన కుమార్తె నిశ్చితార్థ వేడుకలకు అడ్డుగా ఉందని దాతల సాయంతో ఏర్పాటు చేసిన క్యూలైన్లను కట్ చేసి తొలగించిన వైనం బయట పడింది. నాగలాపురం మండల పరిధిలోని సురుటు పల్లె పల్లికొండేశ్వరాలయంలో వున్న ప్రదోష మండపంలో ఆదివారం వైసీపీ నేత బాలాజీ రెడ్డి కుమార్తె నిశ్చితార్థ వేడుకలు జరిగిన విషయం తెలిసిందే. వచ్చిన బంధు మిత్రులను ఏకంగా కుర్చీలు వేసి కూర్చోబెట్టడం



తొలగించిన గ్రిల్‌ను మళ్లీ దారంతో కట్టిపెట్టిన దృశ్యం

విమర్శలపాలైంది. వేడుకలను వీక్షించేందుకు అడ్డుగా ఉందని ప్రదోష మండపం వద్ద భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన స్టీల్ క్యూలైన్లను కట్ చేసి తొలగించి వుండడం సోమవారం చూసినవాళ్లంతా నోరెళ్లబెట్టారు. ఆలయంలో జరిగే ప్రదోష పూజలకు, మహా శివరాత్రి వంటి విశేష రోజుల్లో భక్తుల రద్దీని కట్టడి చేసేందుకు నలుగురు దాతలందించిన సుమారు 15 లక్షల రూపాయలతో స్టీల్ గ్రిల్స్‌తో ఆలయంలో పలు చోట్ల క్యూలైన్లు ఏర్పాటు చేశారు. అటువంటి క్యూలైన్లను తొలగించడంపై భక్తులు మండిపడు తు న్నారు. ఆలయ సిబ్బంది క్యూలైన్‌ను కట్ చేయవద్దని అభ్యంతరం తెలిపినా కూడా తొలగించినట్లు సమాచారం. రాష్ట్రంలో ప్రభుత్వం మారి.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఇంకా వైసీపీ నేతల హవా కొనసాగుతుం డడం, అధికారులు ఇంకా వారి చెప్పు చేతల్లోనే ఉన్నారనడానికి ఈ ఉదంతం ఓ నిదర్శనం. వైసీపీ ప్రభుత్వ హయాంలో బాలాజీరెడ్డి పల్లికొండేశ్వరాలయ ఛైర్మన్‌గా సంస్కరణల పేరుతో ఎన్నో అడ్డగోలు నిర్ణయాలు తీసుకోవడంపై అప్పట్లో వివాదాలు చెలరేగాయి. అయితే ఆయన పలుకుబడి కలిగిన నాయకుడు కావడంతో అధికారులు వారించే సాహసం చేయలేక పోయారు. అయితే ప్రభుత్వం మారినా ఆలయంలో ఆయన హవాయే ఇంకా కొనసాగుతుండడం ఆశ్చర్యకరం.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మార్పులు



మార్పులు చేశాక చిత్తూరు ఆర్వో కార్యాలయం

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 16: జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మార్పులకు ప్రభుత్వం శ్రీకారంచుట్టింది. బ్రిటీష్‌కాలం నాటి పద్ధతులను రద్దు చేస్తున్నట్లు ఉత్తర్వులు ఇచ్చింది. సబ్ రిజిస్ట్రార్‌కి ప్రజలకు మధ్య టేబుల్ తప్ప మరేమీ అడ్డంకిగా ఉండకూడదని రెవెన్యూ, రిజిస్ట్రేషన్లశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా ఆదేశించారు. ఈమేరకు కార్యాలయాల్లో ఉండే ప్రత్యేక పోడియాన్ని తొలగించి, ప్రజలను గౌరవించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే కార్యాలయానికి వచ్చేవారికి కుర్చీలు, తాగునీటితోపాటు అవకాశం ఉంటే టీ, కాఫీ సరఫరా చేయాలని ఆదేశాల్లో పేర్కొంది. సబ్ రిజిస్ట్రార్ కుర్చీని కూడా ఎత్తులో కాకుండా సాధారణ ఫ్లోరింగ్ ఎత్తులోనే ఉండేవిధంగా మార్పులు జరిగాయి. జిల్లాలోని చిత్తూరు ఆర్వో, కార్వేటినగరం, బంగారుపాళ్యం, పలమనేరు, నగరి, కుప్పం, పుంగనూరు, చిత్తూరు రూరల్ ప్రాంతాల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వీటిల్లో ప్రత్యేక పోడియాన్ని ఆదివారం తొలగించి.. ఒకే ఫ్లోర్‌లో కార్యాలయం ఉండేలా ఏర్పాట్లు చేపట్టారు. ఆదివారం సెలవైనప్పటికీ కార్యాలయానికి వచ్చిన సబ్ రిజిస్ట్రార్లు రాత్రి వరకు దగ్గరుండి పనులు చేయించారు. కొన్ని ఇంజనీరింగ్ పనులను సోమవారం పూర్తి చేశారు.

వి.కోట అల్లర్ల కేసుల్లో అరెస్టులకు రంగం సిద్ధం

- ఇప్పటి వరకు ఏడు కేసుల నమోదు



వి.కోట స్టేషన్ వద్ద ఆందోళనకు దిగిన నిందితుల బంధువులు (ఫైల్ ఫోటో)

వి.కోట, సెప్టెంబరు 16: వి.కోట అల్లర్ల సంఘటనకు సంబంధించి ఇప్పటివరకు నమోదైన ఏడు కేసుల్లో నిందితులను అరెస్టు చేసేందుకు పోలీసులు రంగం సిద్ధం చేశారు. ఈ నెల 2న జరిగిన ఘటనలపై ఇరు వర్గాల ఫిర్యాదుల మేరకు పోలీసులు కేసులు నమోదు చేసి ప్రధాన నిందితుడు ఆరిఫ్‌ను అరెస్టు చేసి రిమాడుకు తరలించారు. ఇటీవల గంగమ్మ గుడి వీధిలో ఇరు వర్గాల మధ్య జరిగిన ఘర్షణ అల్లర్లకు దారి తీసింది. డీఎస్పీ ప్రభాకర్ సహ ఎస్బీ పోలీసు ప్రకాష్‌తో పాటు ఓ విలేకరి గాయపడ్డారు. బాధితుల ఫిర్యాదుల మేరకు పోలీసులు వివిధ రకాల సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఘటనకు బాధ్యులైన నిందితుల కోసం పోలీసులు వెదుకుతున్నారు. అల్లర్లలో పాల్గొన్న వారందరిపై నిఘా ఉంచి నిందితులను గుర్తించారు. ఇరువర్గాలకు చెందిన సుమారు వంద మందిపై కేసులు నమోదయ్యాయి. మూడు రోజుల క్రితం నలుగురు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకోగా వారి బంధువులు పెద్ద సంఖ్యలో స్టేషన్ వద్దకు చేరుకున్నారు. కేసుల్లో లేని వారిని అరెస్టు చేశారని, తక్షణం విడిచి పెట్టాలంటూ ఆందోళనకు దిగారు. దీంతో పోలీసులు నలుగురికి సెక్షన్ 41 నోటీసులు ఇచ్చి పంపేశారు. ఏడు కేసులకు సంబంధించి ఓ నిందితుడు రిమాండులో ఉండగా, మిగిలిన కేసులో 20 మందిని అదుపులోకి తీసుకుని నోటీసులు ఇచ్చి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ కేసులో అరెస్టుల భయంతో ఇప్పటికే వందలాది మంది పొరుగు రాష్ట్రాలకు వెళ్లిపోయినట్లు తెలిసింది. పోలీసులు పలు బృందాలుగా అన్వేషిస్తున్నారు. జిల్లా ఎస్పీ మణికంఠ రోజూ ఈ కేసు పురోగతిపై సమీక్షిస్తున్నారు.

ఈ-పంట నమోదులో వేలిముద్రలే కీలకం

- 23కు గడువు పొడిగించిన ప్రభుత్వం



ఈ-పంట నమోదు చేస్తున్న
జిల్లా వ్యవసాయ శాఖాధికారి మురళీకృష్ణ (ఫైల్ ఫొటో)

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 16: జిల్లాలో ఖరీఫ్‌లో ఈ-పంట నమోదు పూర్తయినా వీఏఏ, వీఆర్వో, రైతుల వేలిముద్రలు వేయడం కీలకంగా మారింది. మరోవైపు ల్యాండ్ పార్సిల్ (ఎల్‌పీ) నెంబర్లు అడ్డంకిగా మారాయి. ఈ క్రమంలో రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది. ఈ-పంట నమోదు ప్రక్రియ ఆదివారం నాటికి ముగిసినా, రైతుల ప్రయోజనార్థం కూటమి ప్రభుత్వం ఈ-పంట గడువును ఈనెల 23వ తేదీవరకు పెంచింది. జిల్లాలోని 1,10,603 మంది రైతులు 2,42,174 ఎకరాల్లో దాదాపు 23 రకాలైన పంటలు సాగు చేయాల్సి ఉండగా, 2,42,236 ఎకరాల్లో (100.03 శాతం) సాగు చేశారు. వీటికి సంబంధించిన ఈ-పంట నమోదు ప్రక్రియను వ్యవసాయ, రెవెన్యూ శాఖలు కలిపి చేయాలి.

పూర్తయ్యింది 72 శాతమే..

జిల్లాలో 73,649 మంది రైతులు 1,66,340 ఎకరాల్లో (72 శాతం) పూర్తి చేశారు. 36,954 మంది రైతులు 75,896 ఎకరాల్లో (28 శాతం) ఈ-పంట నమోదు మినహా, వీఏఏ, వీఆర్వో, రైతుల వేలిముద్రల ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది.

ఎల్పీ నెంబర్లతో అడ్డంకి

పాత రెవెన్యూ జాబితా ప్రకారం రైతుల వారీగా సర్వే నంబర్లు ఉన్నాయి. భూ-రీ సర్వేలో చేపట్టిన గ్రామాల్లో సర్వేలో సర్వే నెంబర్లకు బదులుగా, ల్యాండ్ పార్సిల్ (ఎల్పీ) నెంబర్లు ఇచ్చారు. ఇది ఈ-పంట నమోదుకు పూర్తి అడ్డంకిగా మారింది. రైతు సేవా కేంద్రాల్లో ఎల్‌పీ నెంబర్లు డౌన్‌లోడ్ కావడం లేదు. రెవెన్యూ శాఖ ఎల్‌పీ నెంబర్లు డౌన్‌లోడ్ చేసి రైతు సేవా కేంద్రాలకు పంపితేనే వీఏఏలు ఈ-పంట నమోదు చేయగలుగుతారు. ఈ పరిస్థితుల్లో పెంచిన గడువులోగా అయినా పూర్తవుతుందో లేదో వేచి చూడాలి.

రెండు కిలోల గంజాయి స్వాధీనం: ఇద్దరి అరెస్టు

చిత్తూరు, సెప్టెంబరు 16: గంజాయి విక్రయించడానికి ప్రయత్నిస్తున్న ఇద్దరిని ఒకటో పట్టణ పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సీఐ జయరామయ్య తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు ఏఆర్ టాప్‌లైన్‌లో గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. అక్కడికి చేరుకున్న పోలీసులు సంతపేటకు చెందిన అక్బర్(32), చామంతిపురానికి చెందిన రామ్మూర్తి (55)ని అదుపులో తీసుకున్నారు. తనిఖీ చేయగా వారి వద్ద 55,500 విలువైన రెండు కిలోల బరువున్న రెండు ప్యాకెట్లను గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. అనంతరం చిత్తూరు డిప్యూటీ తహసీల్దార్ ధనంజయులు సమక్షంలో నిందితులను, గంజాయిని ప్రవేశపెట్టిన అనంతరం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

నేటినుంచి 15 రోజులపాటు స్వచ్ఛతా హీ సేవ

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 16: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు మంగళవారం నుంచి పక్షం రోజులపాటు జిల్లావ్యాప్తంగా నిర్వహించేందుకు యంత్రాంగం ఏర్పాట్లు చేపట్టింది. మంగళవారం యాదమరి సమీపంలోని మహాసముద్రం వద్ద బెంగళూరు - చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవేలో మొక్కల పెంపకం డ్రైవ్ నిర్వహిస్తారు. ఇతర ప్రాంతాల్లో మానవహారం, పరిశుభ్రతపై మెగా డ్రైవ్, వైద్య ఆరోగ్య శాఖ ద్వారా ఆరోగ్య సంరక్షణ సేవలు నిర్వహిస్తారు. 18న స్వచ్ఛతా పరుగులు, బ్లీచింగ్, దోమల నివారణ మందుల పిచికారి, నీరు నిల్వే ప్రదేశాలను శుభ్రపరచడం, పారిశుధ్య కార్మికులకు ప్రథమ చికిత్స నిర్వహిస్తారు. 19న ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, బహిరంగ ప్రదేశాల్లో స్వచ్ఛతా ప్రతిజ్ఞలు, డంప్‌ల గుర్తింపు - తొలగింపు, పారిశుధ్య కార్మికులను గుర్తించి, వారికి మంజూరైన పథకాలతో అనుసంధానం చేస్తారు. 20న మొక్కల పెంపకం కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. 21న అవగాహన ప్రచారాలు, ర్యాలీలు, పరిశుభ్రత డ్రైవ్, పార్కులను శుభ్రపరచడం, నిర్వహణ, అభివృద్ధి, పీపీఈ కిట్లు, సేఫ్టీ గేర్లు పంపిణీ చేస్తారు. 22న మిషన్ లైఫ్ ప్రచారాలు, కాల్వలు శుభ్రపరచడం, పారిశుధ్య కార్మికులు, వారి కుటుంబాలకు ఆరోగ్య పరీక్షలు చేయిస్తారు. 23న వర్షపు నీటి నిల్వ నిర్మాణాల నిర్వహణపై అవగాహన, రహదారుల శుభ్రతా కార్యక్రమాలు చేపడతారు. 24న తాగు నీటి నిర్మాణాల పరిశుభ్రత, నిర్వహణపై అవగాహన ప్రచారం, నీటి నమూనా పరీక్షలు, వ్యక్తిగత రక్షణపై సఫాయిమిత్రలు, వారి కుటుంబాలకు అవగాహన ఉంటాయి. 25న వీధినాటకాలు, మార్కెట్ ప్రాంతాలను శుభ్రపరుస్తారు. 26న అవాంఛిత యాప్‌లను క్లియర్ చేయడం, సైబర్, డిజిటల్ స్వచ్ఛత, సంస్థాగత భవనాలు శుభ్రపరచడం, పిల్లల సంరక్షణ కార్యక్రమాలు చేపడతారు. 27న గ్రామ, వార్డు సభల నిర్వహణ, ప్రభుత్వ ఖాళీస్థలాల సుందరీకరణ, టూరిస్టు పాయింట్లు, వీధుల పరిశుభ్రత డ్రైవ్‌లు చేపడతారు. 28న సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ఆస్తుల సుందరీకరణ పునర్వినియోగానికి పనికొచ్చే ఈ-వ్యర్థాల సేకరణ వంటి కార్యక్రమాలు చేపడతారు. 29న చెత్తను సృష్టించే ఆర్ట్ శానిటేషన్ పార్కులపై అవగాహన కార్యక్రమాలు చేస్తారు. 30న మూలాల విభజన, రీసైక్లింగ్ పద్ధతులు, కంపోస్టింగ్ ప్రదర్శనలు, కమ్యూనిటీ బేస్డ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్ అవగాహన డ్రైవ్‌లు, ఆరోగ్య బీమా నమోదులో సహకారం వంటి కార్యకలాపాలు ఉంటాయి. అక్టోబరు 1న విద్యాసంస్థల్లో స్వచ్ఛ హాకథాన్ల నిర్వహణ, పబ్లిక్ టాయిలెట్స్ శుభ్రపరుస్తారు. చివరిరోజైన అక్టోబరు 2న శానిటేషన్ కార్మికులు, ఇతరుల గుర్తింపు, సన్మాన కార్యక్రమాలు చేపడతారు.

నేడు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 16: ఆల్బెండజోల్ మాత్రలతో నులి పురుగులకు చెక్ పెట్టవచ్చునని జిల్లా టీబీ నివారణ అధికారి వెంకట ప్రసాద్ తెలిపారు. మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా 1-19 సంవత్సరాల పిల్లలందరికి ఆల్బెండజోల్ మాత్రలు మింగించే కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తం 1-19 సంవత్సరాల వయస్సున్న పిల్లలు 3,63,888 మంది ఉన్నారని గుర్తించామని తెలియజేశారు. అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాల, కళాశాల విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం తర్వాత ఆల్బెండజోల్ మాత్రలు మింగించే కార్యక్రమం నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ మాత్రలు కారణంగా కడుపులోని నులిపురుగులు నిర్మూలన అవుతుందని, తద్వారా పిల్లలు ఎదుగుదల బాగా ఉంటుందని ఆయన తెలియజేశారు. 17వ తేదీన 95 శాతం మందికి మాత్రలు మింగించాలని, మిగిలిన వారికి 25వ తేదీలోపు పూర్తి చేయాలని తెలిపారు.

పాతపేటలో ఏనుగు హల్‌చల్

కల్లూరు, సెప్టెంబర్ 16: పులిచెర్ల మండలం పాతపేట సమీపంలో ఆదివారం రాత్రి ఒంటరి ఏనుగు హల్‌చల్ చేసింది. ఘీంకారాలతో ప్రజలను భయభ్రాంతులు చేసింది. పాతపాళ్యం అటవీప్రాంతం నుంచి నాలుగు రోజులు క్రితం వచ్చిన నాలుగు ఏనుగుల గుంపు ఇదే ప్రాంతంలో తిష్ట వేసి పంటలను ధ్వంసం చేస్తుండటంతో పంటలకు అపారనష్టం నష్టం వాటిల్లింది. ఆదివారం రాత్రి ఒంటరి ఏనుగు గ్రామం వద్దకు చేరుకొని పంటలను ధ్వంసం చేసింది. గ్రామానికి సమీపంలో వరి, అరటి తదితర పంటలను నాశనం చేసింది. కోతకు వచ్చే సమయంలో రైతు సుబ్రమణ్యంకు చెందిన ఎకరా వరిపంట పాడుచేసింది. కుప్పయ్యకు చెందిన అరటిచెట్లను కూడా ధ్వంసం చేసింది. తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.





ధ్వంసమైన వరి, అరటి పంటలు

సచివాలయ సెక్రటరీపై
చేయిచేసుకున్న ట్రాఫిక్ సీఐ!



గాయాలు చూపుతున్న రోహిత్

చిత్తూరు, సెప్టెంబరు 16: సచివాలయ సెక్రటరీపై చిత్తూరు ట్రాఫిక్ సీఐ చేయి చేసుకున్నాడు. బాధితుడి వివరాల మేరకు.. చిత్తూరు నగరానికి చెందిన రోహిత్ తవణంపల్లె మండలం ముట్టుకూరు సచివాలయంలో సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం సాయంత్రం నగరంలోని గాంధీ విగ్రహం ఎదురుగా ఉన్న చాముండేశ్వరి ఐస్‌క్రీం పార్లర్ ఎదుట తన ద్విచక్ర వాహనాన్ని పార్క్ చేశాడు. తిరిగి వాహనాన్ని తీస్తున్న సమయంలో ట్రాఫిక్ సీఐ వచ్చి వాహనాన్ని త్వరగా తీయాలని చెపుతూ రోహిత్‌పై చేయి చేసుకున్నాడు. తాను సచివాలయ సెక్రటరీనని, వాహనాన్ని తీస్తున్నానని చెబుతున్నా దుర్భాషలాడుతూ కొట్టాడు. ఇదేంటని ప్రశ్నిస్తే పోలీసు జీపులో ఎక్కించి, తప్పుడు కేసులు నమోదుచేసి ఉద్యోగం నుంచి తీసివేస్తానని సీఐ బెదిరించాడు. స్థానికులు అడ్డుకోవడంతో తనను విడిచిపెట్టాడని రోహిత్ వివరించాడు. ఈ విషయంపై ఎస్పీకి ఫిర్యాదు చేస్తానని తెలిపాడు.

కాణిపాకంలో వైభవంగా వేదసభ



ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 16: కాణిపాక వరసిద్ధుడి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల చివరి రోజున సోమవారం రాత్రి కల్యాణ వేదిక వద్ద వేదసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని వివిధ ప్రధాన ఆలయాల నుంచి 40 మంది వేదపండితులు విచ్చేశారు. కార్యక్రమంలో పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్, ఈవో గురుప్రసాద్, తిరుపతి దేవదాయ శాఖ ఆర్జేసీ ఎన్‌వీవీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో తెలంగాణ న్యాయమూర్తి



జస్టిస్ ఈవీ వేణుగోపాల్‌కు జ్ఞాపికను అందిస్తున్న
ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 16: తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈవీ వేణుగోపాల్ కుటుంబ సమేతంగా సోమవారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. సూపరింటెండెంట్ వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ రవి, కాణిపాకం ఎస్ఐ ధరణీధర్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ కష్టాలు తీరేదెప్పుడో..?

● ఇక్కట్లు పడుతున్న పీటీఎం వినియోగదారులు ● గ్యాస్ కావాలంటే తప్పని ఎదురుచూపులు



పీటీఎంలో ఉన్న గ్యాస్ గోడౌన్‌కు నోస్టాక్ బోర్డును తగిలించిన దృశ్యం

పెద్దతిప్పసముద్రం సెప్టెంబర్ 16 : పెద్దతిప్పసముద్రం మండలంలో ఇండేన్ గ్యాస్ సిలిండర్ కోసం వినియోగదారులకు తిప్పలు తప్పడం లేదు. గ్యాస్ కావాలంటే వారం, పదిరోజులు ఎదురు చూడాల్సిన దుస్థితి నెలకొంది. అసలు సిలిండర్‌లు ఎప్పుడు వస్తాయో? ధర ఎంత చెల్లించాలో? అనే విషయంపై గ్యాస్ ఎజెన్సీ నిర్వహణ దారుల తీరుపట్ల సర్వత్రా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్ సిలిండర్ కావాలంటే కనీసం వారం పదిరోజులైనా ఆఫీస్‌ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెల కొందని వినియోగదారులు వాపోతున్నారు. గ్యాస్ ఏజెన్సీలో సిలిండర్ ఎప్పుడు వస్తుందో సమాచారం చెప్పేవారే కరువయ్యారని వినియోగదారులు మండిపడుతున్నారు. పెద్దతిప్పసముద్రం మండలంలో ఇండేన్ గ్యాస్ ఎజెన్సీ మాత్రమే ఉండడంతో వారు ఎలా చేసినా, ఏమి చెప్పినా చెల్లుబాటవుతోందని వినియోగదారులంటున్నారు.

గ్యాస్ సిలిండర్ కోసం తప్పని ఎదురుచూపులు

పెద్దతిప్పసముద్రం మండలంలో 20 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇంట్లో గ్యాస్ అయిపోగానే ఏ ద్విచక్రవాహనంలోనో, ఏ షేర్ ఆటోలోనో ఖాళీ సిలిండర్ ను ఉంచుకుని గ్యాస్‌బుక్‌ను తీసుకుని 20, 25 కిలోమీటర్లు పయనించి మండలకేంద్రంలో ఉన్న గ్యాస్ ఏజెన్సీ వద్దకు రావాల్సి వస్తోందని వినియోగదారులు వాపోతున్నారు. తీరా ఏజెన్సీ దగ్గరకు ఇంత అగచాట్లు పడి వచ్చినా గ్యాస్ గోడౌన్ గేటుకు ఎప్పుడు చూసినా నోస్టాక్ బోర్డు దర్శనం ఇస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్ సిలిండర్ కోసం ఆన్‌లైన్‌లో ధరఖాస్తు చేసుకున్నప్పటికి కనీసం వారం పదిరోజులైనా వేచి చూడాల్సిన దుస్థితి మండలంలో నెలకొందని గ్యాస్ వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

గ్యాస్ కష్టాలు ఎప్పుడు తీరేనో..?

పీటీఎం మండలంలో వంట గ్యాస్ కష్టాలు ఎప్పుడు తీరుతాయోనని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు. గ్యాస్ ఎజెన్సీ నిర్వాహకులు సరైనా సమయంలో గ్యాస్‌కు డీడీలు చెల్లించక పోవడంతో స్టాక్ రాక తీరని జాప్యం జరుగుతోందని పలువురు వినియోగదారులు ఆరోపిస్తున్నారు. మండలంలోని 20 గ్రామ పంచాయతీలలో మొత్తం 19,116 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. అందులో 12,214 దీపం కనెక్షన్లు కాగా వాటిలో 6406 జనరల్ కనెక్షన్లు ఉన్నాయి. 87 అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించి 352 సీఎస్ ఆర్ కనెక్షన్లు ఉండగా స్థానిక పీటీఎంలో వాణిజ్య కనెక్షన్లు ఉన్నాయి. అయితే వాణిజ్య కనెక్షన్లు పొందినవారు బ్లాక్‌లో పొందిన సిలిండర్లతోనే పని కానిచేస్తున్నారు. దీంతో సాదరణ వినియోగదారులు సకాలంలో సిలిండర్లు అందక ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. కాగా గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు తమ సొంత వాహనంలో గ్యాస్ తరలించి అదనంగా వసూలు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రానికి వచ్చి గ్యాస్ వినియోగదారులు గ్యాస్ తీసుకుంటే రూ. 839 లు తీసుకోవాల్సి ఉండగా అదనంగా రూ 11 వసూలు చేస్తున్నారు. గ్రామాల్లోకి తమ వాహనం ద్వారా సరఫరా చేస్తే రూ 50 నుంచి రూ 100 వసూలు చేసి సొమ్ము చేసుకుంటున్నారని విమర్శిస్తున్నారు.

15 కి.మీ. పరిధిలో ఎలాంటి రుసుం చేయవద్దు

కొత్తగా వచ్చిన జీవో ప్రకారం మండలానికి 15 కిలోమీటర్ల పరిధిలో గ్యాస్ వినియోగదారుల నుంచి ఎలాంటి రుసుము వసూలు చేయరాదు. గ్యాస్ వినియోగదారులకు ఖచ్చితంగా రసీదు ఇవ్వాల్సిందే. ఇందుకు విరుద్ధంగా వసూలు చేస్తున్నట్లు మా దృష్టికి తెస్తే తగిన చర్యలు తీసుకుంటాం. గ్యాస్ వినియోగదారులు ప్రతి ఒక్కరు ఆన్ లైన్‌లో బుక్ చేసుకుంటే డోర్ డెలవరీ ఇవ్వాలి. వినియోగదారులకు గ్యాస్‌పై ఏజెన్సీ నిర్వాహకులు సమగ్ర సమాచారంతోపాటు సిలిండర్‌ను తప్పకుండా డోర్ డెలివరి చేయాలి. వినియోగదారులకు ఇబ్బందులు పెడితే అలాంటి ఫిర్యాదులు వస్తే గ్యాస్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవడంతోపాటు ఏజెన్సీ లెసెన్స్‌ను రద్దు చేస్తాం.

-వెంకటరెడ్డి, సివిల్‌సప్లైస్ డీటీ, పీటీఎం

వారం పదిరోజుల నుంచి తిరుగుతున్నా

గ్యాస్ సిలిండర్ కోసం వారం పదిరోజుల నుంచి తిరుగుతున్నా గోడౌన్ ఎప్పుడు చూసినా గేటుకు నోస్టాక్ బోర్డు పెట్టి ఉంటుంది. నేను వ్యవసాయ పనులను చేస్తాను. గ్యాస్ సిలిండర్ కోసం కూలి పనులను వదులుకుని వెళ్లాల్సి వస్తోంది

- షేక్ మస్తాన్ వ్యవసాయ కూలీ విసనకర్రవాండ్లపల్లె



గ్యాస్ ఎప్పుడొస్తుందో చెప్పేవారే లేరు.

గ్యాస్ కోసం పదిరోజుల నుంచి పీటీఎంకు తిరుగుతున్నా. కనీసం అక్కడ గ్యాస్ ఎప్పుడొస్తుందో చెప్పేవారే లేరు. నేనే కూలీ పనులు చేసుకుంటు జీవనం సాగించుకుంటున్నాం. గ్యాస్ కోసం రోజు మం డల కేంద్రానికి 10 కిలోమీటర్లు తిరిగి వెళ్లాల్సి వస్తోంది గ్యాస్ నిర్వా హకులు సకాలంలో గ్యాస్ తెస్తే కూలీలకు ఉపయోగ కరంగా ఉంటుంది.

- పుంగనూరు ఆంజనేయులు, వ్యవసాయ కూలీ



ఎస్సీ ఎస్టీ కేసులో డీఎస్పీ విచారణ


కలికిరిలో కేసు గురించి విచారణ చేస్తున్న డీఎస్పీ సుధాకర్

కలికిరి, సెప్టెంబర్లు 16: కలికిరి పోలీసు స్టేషన్‌లో నమోదైన ఒక ఎస్సీ, ఎస్టీ కేసులో నిజానిజాలు వెలికి తీయడానికి రాయచోటి ఇన్‌చార్జి డీఎస్పీ ఎన్.సుధాకర్ విచారణ చేపట్టారు. సోమవారం ఆయన పట్టణంలోని ప్రధాన వీధిలో సంఘటన జరిగిన పరిసరాల్లో బహిరంగ విచారణ చేశారు. కేసుకు సంబంధించిన వివరాలిలావున్నాయి. పట్టణానికి చెందిన చర్చి వీధిలో నివసిస్తున్న గడ్డం ఏసు రాజు అనే ఎస్సీ కులానికి చెందిన వ్యక్తి పై ఐదుగురు దాడి జరిపి గాయపరిచారు. ఈ సంఘటన గురించి ఏసురాజు ఇచ్చి ఫిర్యాదు మేరకు బజారు వీధికి చెందిన ఎస్. ఖాదర్, ఎస్. జాకీర్, ఎస్.ముబారక్, ఎస్.షాహీర్‌తోపాటు ఇందిరమ్మ కాలనీకి చెందిన మరో యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ మహ్మద్ ఆలీ నమోదు చేసిన ఈ కేసు రాయచోటి డీఎస్పీకి బదిలీ చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా సోమవారం డీఎస్పీ సుధాకర్ సంఘటన జరిగిన పరిసర ప్రాంతాల్లో విచారణ చేపట్టారు. ప్రత్యక్ష సాక్షులను విచారించారు. అందరి వాఙ్మూలాలను నమోదు చేశారు. బాధితుడు ఏసురాజు నుంచి కూడా వివరాలు రాబట్టారు. డీఎస్పీ వెంట కలికిరి పోలీసులు కూడా పాల్గొన్నారు.

వరకట్న వేధింపులు... ఇద్దరిపై కేసు నమోదు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు16: వరకట్న వేధింపులకు సంబంధించి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. పోలీసుల వివరాల మేరకు మదనపల్లె పట్టణం లక్ష్మీనగర్‌కు చెందిన భవాని(25)కి బి. కొత్తకోట మండలం, దొమ్మన్నబావి సమీపంలో చౌటకుంట్లపల్లెకు చెందిన రాజశేఖర్‌తో 2019లో వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలున్నారు. అయితే భార్య భవాని రెండు లక్షలు అదనపు కట్నం తేవాలని భర్త రాజశేఖర్ వేధింపులకు గురిచేస్తుంటే మదనపల్లెలోని అమ్మగారి ఇంటికి వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ మేరకు ఆమె భర్త రాజశేఖర్, అత్త ఆదిలక్ష్మి పై వరకట్న వేధింపులు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

రామసముద్రం, సెప్టెంబరు 16: కుటుంబ కలహాలతో వివాహిత విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం మండ లంలోని కురుదుచీమనపల్లెలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు కుదురుచీమనపల్లెకు చెందిన ఆటో డ్రైవర్ జబ్బార్ పగలంతా ఆటో నడిపి వచ్చే డబ్బుతో సాయంత్రం మద్యానికే ఖర్చు పెట్టేవాడు. ఈ విషయమై భార్య ఆయేషా సోమవారం భర్తను నిలదీసి గొడవపడింది. భార్యభర్తల మధ్య వాదోపవాదాలు జరుగగా ఆయేషా మనస్థాపం చెంది ఇంట్లోని విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా ఆమెను చికిత్స నిమిత్తం మదనపల్లెకు తరలించారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు16: నాలుగునెలల క్రితం హత్యాయత్నానికి గురైన యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. సీఐ కథనం మేరకు ములకలచెరువు మండలం, దేవలచెరువుకు చెందిన సాంబశివ(30) మదనపల్లె పట్టణం నీరుగట్టువా రిపల్లెలో కూలీ మగ్గాలు నేస్తూ జీవనం గడిపేవాడని, పక్కనే ఉన్న లతీఫ్ చెల్లితో వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో లతీఫ్ కత్తితో పొడి చాడన్నారు. దీంతో గాయపడిన సాంబశివ నాలుగు నెలలుగా చిక్సిత పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు సీఐ తెలిపారు.

రెండు వర్గాలు ఘర్షణ.. యువకుడిపై దాడి

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు16: మదనపల్లె మండలం, కొత్తపల్లె పంచాయతీ, వడ్డిపల్లెకు చెందిన ఇరువర్గాలు వినాయక విగ్రహాలు ఏర్పాటు విషయంలో గొడవ పడి ఓ వ్యక్తిపై దాడిచేశారు. పోలీసుల కథనం మేరకు ఘర్షణలో భాగంగా విష్ణు, వినోద్‌లు మరి కొందరితో కలిసి అఖిలేష్ ఇంటిలో దూరి గొంతు కొసి పారిపోయారు. అనంతరం స్థానికులతో కలిసి అతను జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లారు. కొంత సమయం తరువాత విష్ణు, వినోద్ వర్గీయులు అఖిలేష్ అమ్మ రెడ్డెమ్మ, రమ ణ, కళ్యాణి, అరవింద్‌పై దాడి చేశారు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వెంకన్న ఆలయ ఆభరణాలు తనిఖీ


ఆభరణాలను తనిఖీ చేస్తున్న టీటీడీ అధికారులు

తంబళ్లపల్లె, సెప్టెంబరు 16: తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లె ప్రసన్న వేంకటరమణ స్వామి ఆలయానికి సంబంధించి స్వామి, అమ్మవారి ఆభరణాలను టీటీడీ గోల్డ్ వెరిఫికేషన్ అధికారులు ఇన్వెంటరీ తనిఖీ చేశారు. సోమవారం టీటీడీ ఇన్వెంటరీ తనిఖీ అధికారుల బృందం సభ్యులు ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్ మునిబాలకుమార్, మునిచెంగల్రాయులు ఆలయంలో ఆభరణాలను పరిశీలించారు. ప్రతి ఏడాది చేపట్టే సాధారణ తనిఖీల్లో భాగంగా ఆలయానికి సంబంధించి స్వామి, అమ్మవారి నగలను పరిశీలించినట్లు అధికారులు తెలిపారు. అన్ని ఆభరణాలు సవ్యంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో వరలక్ష్మీ, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిశంత్‌కుమార్, సిబ్బంది నగేష్ పాల్గొన్నారు.

వైభవంగా వినాయక నిమజ్జనం


ఏఎస్ కాలనీలో విభిన్న వేషధారణలో వినాయకుడి ఊరేగింపులో యువకులు

రామసముద్రం, సెప్టెంబరు 16: మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి కాలనీలో సోమవారం వినాయక నిమజ్జనం వైభవంగా నిర్వహించారు. విభిన్న సంప్రదాయ వేషధారణలో యువకులు నృత్యాలు చేస్తూ విగ్రహ ఊరేగింపులో పాల్గొన్నారు. స్థానిక కాలనీ వాసులు ఎంతో భక్తి శ్రద్ధలతో గణపయ్యకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తమిళనాడు నుంచి తెప్పించిన పటాకీ మిషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలాగే తమిళనాడు నుంచి తెప్పించిన కీలుబొమ్మలు, గారడీ బొమ్మలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఏఎస్ కాలనీ వారిచే భక్తులకు అన్నదానం నిర్వహించారు. అలాగే గాజులునగరంలో కోలాహలంగా ఉట్లోత్సవం నిర్వహించారు.

డబ్బు అడిగినందుకు రైతుపై దాడి

రామసముద్రం, సెప్టెంబరు 16: కొత్తిమీర పంట అమ్మిన డబ్బులు అడిగినందుకు రైతుపై కొనుగోలుదారుడు దాడి చేసి గాయపరిచినట్లు బాధిత రైతు తెలిపారు. మట్లవారిపల్లెకు చెందిన రైతు వెంకటరమణ కొత్తిమీర తోట సాగు చేశాడు. దిన్నిపల్లెకు చెందిన వ్యాపారస్తుడు నాగరాజు వెంకటరమణ దగ్గర కొత్తిమీర రూ.1.70లక్షలకు తోట కొన్నాడు. అడ్వాన్సుగా రూ.70వేలు ఇచ్చి మిగిలిన రూ.లక్ష తోట పెరికిన తర్వాత ఇస్తానని చెప్పాడు. అయితే తోట పెరికిన తర్వాత మిగిలిన డబ్బులు అడిగినందుకు వెంకటరమణపై నాగరాజు దాడి చేసి గాయపరిచాడు. ఈ విషయంపై వెంకటరమణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

నేటి నుంచి ధార్మిక సదస్సు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 16:స్థానిక బెంగళూరు బస్టాండ్ వద్ద ఉన్న బడేమకాన్ దర్గాలో మంగళవారం రాత్రి నుంచి మీలాద్- ఉన్- నబీ ధార్మిక సదస్సు నిర్వహిస్తున్నట్లు దర్గా కమిటీ నిర్వాహకుడు మకాన్‌దార్ సయ్యద్ హాషిం తెలిపారు. కడపకు చెందిన మతగురువులు హజరత్ మౌల్వి సయ్యద్ అహ్మద్ పీర్ షహమీరి మహా ప్రవక్త జీవితం గురించి ధార్మికోపన్యాసం చేస్తారని పేర్కొన్నారు.

మంత్రిని కలిసిన టీడీపీ బీసీ నేతలు


మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని కలిసిన తంబళ్లపల్లె నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేతలు

కురబలకోట, సెప్టెంబరు 16: రాష్ట్ర రవాణా, క్రీడా సాంస్కృతిక శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని తంబళ్లపల్లె నియోజకవర్గానికి చెందిన పలువురు టీడీపీ నేతలు కలిశారు. సోమవారం రాయచోటికి వచ్చిన సందర్భంగా వారు మంత్రిని కలిసి ఉద్యోగుల బదిలీలలో తాము సిపార్సు చేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. అనంతరం తమ నియోజకవర్గంలో పర్యటించాలని కోరగా, త్వరలోనే పర్యటిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైజ సురేంద్ర, నాగూరి విశ్వనాథరెడ్డి, సూరి పాల్గొన్నారు.

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం


మున్సిపల్ వివేకానంద హైస్కూల్‌లో కలిసిన ఉపాధ్యాయులు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 16: సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పలువురు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. 1991లో కోలార్ గోల్డ్‌పీల్డ్‌లో ఉపాధ్యాయులుగా ట్రైనింగ్ పూర్తి చేసిన నాటి విద్యార్థులు 33 ఏళ్ల తరువాత స్థానిక నీరుగట్టువారిపల్లె మాయ బజార్‌లోని మున్సిపల్ వివేకానంద హైస్కూల్‌లో సోమవారం ఆత్మీయంగా కలిశారు. ఈ సందర్భంగా తమకు విద్య నేర్పిన గురువులు విశ్వనాథ్, వెంకటరమణ, శ్రీనివాస్, కళావతి చర్చిల్, రామరెడ్డి, శ్రీరామరెడ్డి, గంగులప్ప, శ్రీనివాస గౌడ్‌లకు పాదాభివందనాలు చేసి వారిని దుశ్శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. తమ తీపి గుర్తులను, మధుర అనుభవాలను నెమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పురంవెంకటరమణ, దేవేంద్ర, రెడ్డిమోహన్, రవికుమార్, దినదయాల్, చలపతి, వెంకటరమణ, ప్రేమ, మహలక్ష్మీ, విజయకుమారి, ఇందిరా, భారతి, శివాచారి, బాస్కర్, దామోదర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నాయీబ్రాహ్మణ దినోత్సవం


పీలేరులో సంబరాలు జరుపుకుంటున్న నాయీబ్రాహ్మణులు

పీలేరు, సెప్టెంబరు 16: ప్రపంచ క్షౌరవృత్తిదారుల దినోత్సవాన్ని పీలేరులోని నాయీబ్రాహ్మణులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. పీలేరు-తిరుపతి మార్గంలోని నాయీబ్రాహ్మణ కాలనీలో నాయీబ్రాహ్మణ సంఘం పీలేరు డివిజన్ ఆంజి నేతృత్వంలో కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కులవృత్తిని నమ్ముకుని అనేక అవమానాలు, వివక్షలు ఎదురైనా ఆత్మవిశ్వాసంతో బతుకుతూ మరికొంత మందికి ఉపాధి కల్పిస్తున్న తమకు ప్రభుత్వం అభివృద్ధి పథకాలు అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్, వెంకటరత్నం, రమేశ్, ముఖేష్, తదితరులు పాల్గొన్నారు.

దుస్థితిలో ప్రభుత్వ హాస్టల్ భవనం

పెద్దమండ్యం, సెప్టెంబరు 16: పెద్దమండ్యం హైస్కూల్ సమీపంలో ప్రభుత్వ హాస్టల్ భవనం దుస్థితిలో కొట్టుమిట్టాడుతోంది. నూతన భవన నిర్మాణం కోసం కేటాయించిన స్థలం నిరుపయోగంగా మారడంతో కొన్నేళ్లుగా అద్దె భవనంలోనే హాస్టల్ కొనసాగుతోంది. దీంతో సరైన వసతుల్లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే మండలంలోని కలిచెర్లలో ప్రైవేటు భవనంలో నడుస్తున్న బీసీ హస్టల్‌లో సరైన వసతులు లేక అక్కడి విద్యార్థులు పలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఈ హస్టల్ లో గదులకు స్థాయికి మించి విద్యార్థులు కేటాయింపుతో వారు ఇబ్బందులకు గురవుతున్నారు. గదులకు కిటికీలకు తలుపులు లేక పోవడంతో రాత్రి వేళల్లో విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నా రు. కాగా 54 మంది విద్యార్థులకు గాను ఒకే బాత్ రూం వాడకంతో వారికి ఎలాంటి సౌకర్యాలున్నాయో తెలుస్తోంది. కొన్ని ఏళ్లగా ప్రైవేటు అద్దె భవనంలో నడుస్తున్న ప్రభుత్వ హాస్టళ్లకు ప్రభుత్వాలు ప్రతి ఏడాది అద్దెలు రూపంలో లక్షల నిధులు చెల్లిస్తున్నాయే తప్ప నూతన భవనాలు నిర్మించకపోవడం దారుణం పాఠశాలల అభివృద్ధి కమిటీ ద్వార పాఠశాల అభివృద్ధి పనులు తరహాలోనే పేద విద్యార్థుల హాస్టళ్ల భవన నిర్మాణాలు చేపట్టి, విద్యార్థులకు సౌకర్యాల కల్పనకు అధికారులకు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.


కలిచెర్ల లోని బీసీ హాస్టల్ గది లోపల కిటికీలకు తలుపులు లేని దృశ్యం

భక్తిశ్రద్ధలతో మిలాద్-ఉన్-నబీ వేడుకలు


దర్గాను విద్యుత్ దీపాలతో అలంకరించిన దృశ్యం

రామసముద్రం, సెప్టెంబరు 16: మండలంలో ముస్లింలు సోమవారం మిలాద్-ఉన్-నబీ పండుగ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈసందర్భంగా మన్ ఫీర్ సయ్యద్ షాఖాదరి మాట్లాడుతూ అనంత కరుణామయుడైన అల్లాహ్ సర్వమానవాలి శ్రేయస్సు, శాంతిని నెలకొల్పడం కోసం ఆఖరి ప్రవక్త మహ్మద్‌ను ఎన్నుకున్నట్లు (దైవగ్రంథం) పవిత్ర ఖురాన్‌లో చెప్పబడిందని పేర్కొన్నారు. మహ్మద్ ప్రవక్త చూపిన అడుగు జాడల్లో ప్రతి ముస్లిం నడవాలని ఆయన సూచించారు. మండల కేంద్రంలోని దిన్నిపల్లె సమీపంలో ఉన్న హజ్రత్ మన్ ఫీర్ సయ్యద్ మస్తాన్ షా ఖాదరీ దర్గాలో మహ్మద్ ప్రవక్త పవిత్ర జ్ఞాపిక లకు గంథోత్సవం నిర్వహించారు. ఈకార్యక్రమంలో మన్ ఫీర్ సయ్యద్ గౌస్ షా ఖాదరి, పీఠాధిపతి కుటుంబీకులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో : పెద్దతిప్పసముద్రం మండలంలో సోమవారం మిలాద్-ఉన్-నబీ వేడుకలను ముస్లింలు ఘనంగా నిర్వహించుకున్నారు. మహమ్మద్ ప్రవక్త పుట్టిన రోజును పురష్కరించుకుని మండలంలోని పీటీఎం, కందుకూరు, విసనకర్రవాండ్లపల్లె, మల్లెల, మద్దయ్యగారిపల్లె, పులికల్లు, కమ్మచెరువు, చెన్నరాయునిపల్లె గ్రామాల్లో ప్రవక్త బోధనలు ముస్లిం మత పెద్దలు వివరించారు. ఈ సందర్భంగా కందుకూరులో ముస్లింలు అన్నదానం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

గుర్రంకొండలో: ముస్లింలు మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఇందులో భాగంగా గుర్రంకొండ, తరిగొండ, చెర్లోపల్లె, మర్రిపాడు, సంగసముద్రం గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసి పేదలకు స్వీట్లను పంపిణీ చేశారు.

కలకడలో: మహ్మద్ ప్రవక్త జన్మదినమైన మిలాద్-ఉన్-నబీ పండుగను మండలంలోని ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఇందులో భాగంగా మండలంలోని కలకడ, యర్రయ్యగారిపల్లె, కోన, పాపిరెడ్డిగారిపల్లె గ్రామాల్లో మసీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పేదలకు మిఠాయిలను పంచిపెట్టారు.

తంబళ్లపల్లెలో: మహమ్మద్ ప్రవక్త జన్మించిన సందర్భంగా మిలాద్-ఉన్-నబీ వేడుకలను ముస్లింలు సోమవారం తంబళ్లపల్లె మండలంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తంబళ్లపల్లె మండల కేంద్రంలోని దర్గాను సుందరంగా అలంకరించారు. సోమవారం ఉదయం ముస్లింలు దర్గా వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆరోగ్యవంతులుగా ఉండాలని ప్రార్థనలు చేశారు.

కురబలకోటలో: మహమ్మద్ ప్రవక్త బోధనలే సదాచరణకు గీటురాళ్ళని మతగురువులు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని అంగళ్ళు, కురబలకోట, ముదివేడు, నందిరెడ్డిగారిపల్లె తదితర గ్రామాల్లో మిలాద్- ఉన్- నబి పండుగ వేడుకలను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పరోపకారమే పరమావధిగా జీవితాన్ని కొనసాగించాలన్నారు. అనంతరం ప్రపంచ శాంతి కోసం ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

పెద్దమండ్యంలో: పెద్దమండ్యం మండలంలో సోమవారం మిలాద్ -ఉన్ -నబీ వేడుకలు ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. మహమ్మద్ ప్రవక్త పుట్టిన రోజు పురస్కరించుకొని పెద్దమండ్యం, కలిచెర్ల, కలిచెర్ల పాతూరు, తురకపల్లి, శివపురం, సిద్దవరం, పాపేపల్లి, గుడిసెవారిపల్లి, గురివిరెడ్డిగారిపల్లి, ముసలికుంట, వెలిగల్లు గ్రామాలలో ప్రవక్త బోధనలు వివరించారు. ఈ సందర్భగా పెద్దమండ్యం, కలిచెర్ల, తురకపల్లి ప్రత్యేక ఫాతేహా కార్యక్రమాలతో పాటు ఆయా గ్రామాలలో అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. హుస్సేన్‌సాబ్, బాబాబేగ్, నజీర్‌అహ్మద్, జలీల్, గౌస్, సాదీక్, అహ్మద్, సర్పంచ్ బాషా, అమీన్, రెడ్డిఖాదర్, చాంద్‌బాషా తదితర మత పెద్దలు పాల్గొన్నారు.

ఏపీఎంఎస్ ఎస్టీయూ నూతన కార్యవర్గం ఎంపిక



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎంఎస్ ఎస్టీయూ రాష్ట్రఅధ్యక్షుడు మోహన్‌రెడ్డి

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 16: స్థానిక ఎస్టీయూ భవన్‌లో ఏపీఎంఎస్ ఎస్టీయూ అన్నమయ్య, చిత్తూరు ఉమ్మడి జిల్లాల నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. మదనపల్లెలో జరిగిన ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా చెన్నూరిబాలాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శిగా మోహన్‌మురళి, ట్రెజరర్‌గా కేపీ నాగరాజన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎం. శ్రీనునాయక్, జిల్లా మహిళా అధ్యక్షురాలుగా శెట్టిపల్లె శివకుమారి, జిల్లా కార్యదర్శిగా సీహెచ్ యోజన గంది, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలుగా కె. విజయలక్ష్మీ, ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఆదర్శ పాఠశాల్లోని ఉపాధ్యాయులకు 010 ద్వారా జీతాలు చెల్లిస్తున్నందున ఆదర్శ పాఠశాలలను ప్రభుత్వంలో విలీనం చేసినందులకు వెంటనే సర్వీస్ రూల్స్‌నుఅమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునిరత్నం మాట్లాడుతూ ఉపాధ్యాయులకు వెంటనే హెల్త్ కార్డులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ కల్పించాలని కోరారు. ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోకల మధుసూదన్, జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఆదర్శ పాఠశాల్లో ఉపాధ్యాయుల బదిలీలు నిర్వహించాలని, పాఠశాల్లో ఖాళీలను వెంటనే భర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్స్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరంలో 52 మందికి పరీక్షలు

నిమ్మనపల్లి, సెప్టెంబరు 16: మండలంలోని ముష్టూరు గ్రామపంచాయతి కార్యాలయంలో సోమవారం టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటరమణ, జిల్లా బీసీసెల్ కన్వీనర్ లక్ష్మన్న ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 52 మందికి పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ సిద్దిక్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఫీల్డ్ మేనేజర్ కొండయ్య మాట్లాడుతూ ఎల్‌వీప్రసాద్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు వారి గ్రామాలలోనే ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి కిత్సలు చేసి మందులను ఇస్తున్నట్లు తెలిపారు. కంటి పరీక్షలకు గాను 52మంది హాజరు కాగా వారిలో 6మందిని కంటి శస్త్రచికిత్సలకు నిర్ధారించి ఉచితంగా ఆపరేషన్‌లు చేయనున్నట్లు తెలిపారు. ఈ వైద్యశిబిరం ఏర్పాటుకు సహకరించిన టీడీపీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీనివాసులు, విజయ్, చినబాబు, వెంకటక్రిష్ణ, కేశవ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో అంటు వ్యాధుల నివారణ


గ్రామీణులకు అవగాహన కల్పిస్తున్న వైద్య శాఖాధికారులు

పీలేరు, సెప్టెంబరు 16: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో సీజనల్ వ్యాధుల వ్యాప్తి ఉధృతిని నివారించవచ్చని పీలేరులోని మలేరియా సబ్ యూనిట్ అధికారి విద్యాసాగర్ పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులు, వాటి నివారణకు చేపట్టాల్సిన అంశాలను సోమవారం ఆయన పీలేరు మండలం గూడరేవుపల్లె పంచాయతీ రామానాయక్ తాండాలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధిగా కాచి చల్లార్చిన నీటిని తాగడంతో పాటు చెత్తను ఎక్కడిపడితే అక్కడ పడేయకపోవడం వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. వ్యర్థాల కారణంగా పుట్టుకొచ్చే ఈగలు వాలిన ఆహారపదార్థాలు భుజించడం వల్ల కలరా, అతిసారా, టైఫాయిడ్, కామెర్లు వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని హెచ్చరించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, సిబ్బంది శ్రీనివాసులు, అనిత, తదితరులు పాల్గొన్నారు.

గుర్రంకొండకు ఆర్టీసీ బస్సు ఏర్పాటు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు16: మదనపల్లె- గుర్రంకొండకు మంగళవారం నుంచి ఆర్టీసీ బడి బస్సు నడుపుతున్నట్లు వన్ డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లె- గుర్రంకొండ మార్గంలో విద్యార్థులు ఎక్కువగా ఉండడంతో విద్యార్థుల సౌకర్యార్థం ఉదయం, సాయంత్రం అందుబాటులో ఉండేలా ఆర్టీసీ బడి బస్సును ఏర్పాటు చేశామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఓజోన్‌ను విస్మరిస్తే మానవాళి మనుగడే ప్రశ్నార్థకం


విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న తులసీరామ్‌నాయుడు

కురబలకోట, సెప్టెంబరు 16: ఓజోన్‌ను విస్మరిస్తే మానవాళి మనుగడే ప్రశ్నార్థకమని అడ్వైజర్ ఆర్ అండ్‌డీ తులసీరామ్‌నాయుడు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యుడిని వచ్చే కిరణాలను భూమిపై నేరుగా పడకుండా ఓజోన్ పొర అడ్డుకుంటుందన్నారు. భూమిపై రసాయనాల వాడకం వలన ఓజోన్‌పొర దెబ్బతింటుందని, విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించి బహుమతును అందజేశారు. ఈ కార్యక్రమంలో రంజిత్ భాస్కరన్, కో ఆర్డినేటర్ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.